Crime Mirror
QR Code
https://epaper.crimemirror.com/

# క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
6-11-2024
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:13
సంచిక: 361

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## అణువణువునా కుల వివక్ష: రాహుల్‌గాంధీ



- కార్పొరేట్‌తో పాటు న్యాయ, రాజకీయ వ్యవస్థల్లోనూ ఉంది
- కులగణన సంప్రదింపుల సదస్సులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ
- కుల వివక్ష దేశ ప్రజల జీవితాలను విధ్వంసం చేస్తోంది.. భారత రాజ్యాంగానికి, జాతికీ ముప్పులా పరిణమించింది
- కుల వివక్షను నిర్మూలిస్తానని ప్రధాని మోదీ ఎందుకు చెప్పడం లేదని ప్రశ్న
- కులగణన 100 శాతం పూర్తి చేసి తీరుతాం: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: 'భారత సమాజంలో కుల వివక్ష అన్నిచోట్లా లోతుగా, బలంగా ఉంది. అణువణువునా దేశంలో కుల వివక్ష ఉందన్న వాస్తవాన్ని అందరం అంగీకరించాల్సిందే. ఈ వివక్ష కేవలం దేశ ప్రజల జీవితాలను విధ్వంసం చేయడమే కాదు.. భారత రాజ్యాంగానికి, జాతికి సైతం ముప్పులా పరిణమించింది..' అని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు.

2లో

## సరస్వతీ ప్లాంట్ భూములకు రక్షణ

- బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- పవర్ ప్రాజెక్ట్ పేరుతో 400 ఎకరాల అటవీభూముల స్వాధీనం
- డప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ భరోసా



నరసరావుపేట,(క్రైమ్ మిర్రర్): వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కుటుంబానికి చెందిన సరస్వతి పవర్ ఇండస్ట్రీస్ భూములకు సంబంధించిన బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు.

2లో



## ఆటో డ్రైవర్లూ ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి

- కాంగ్రెస్ ప్రభుత్వంతో అన్ని వర్గాల్లోనూ ఆందోళన
- ఆటో డ్రైవర్ల మహాధర్నాలో కేటీఆర్ విమర్శలు

హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్): మార్పు, మార్పు అనుకుంటూ అందరి కొంపలు పుచ్చుకున్నారు... ఈ కాంగ్రెసోళ్లు అని రేవంత్ రెడ్డి సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆటో డ్రైవర్లు కూడా ఆత్మహత్య చేసుకునే దుస్థితి వచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితిని తీసుకొచ్చింది. దాదాపు ఆరున్నర లక్షల మంది ఆటోడ్రైవర్ల పరిస్థితి చాలా దయనీయంగా ఉందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

మిగతా 2లో

## ఏకపక్షంగా ఆస్తుల స్వాధీనం కుదరదు

- అన్ని ఆస్తులను సమాజ ఆస్తులుగా గుర్తించలేం
- సుప్రీం కోర్టు ధర్మాసనం చారిత్రక తీర్పు



ఏకపక్షంగా వ్యక్తుల ఆస్తులను స్వాధీనంచేసుకునే హక్కు ప్రభుత్వాలకు లేదని, ప్రైవేటు ఆస్తుల స్వాధీనం విషయంలో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. ప్రైవేటు యాజమాన్యంలోని అన్ని ఆస్తులను ఉమ్మడి ప్రయోజనం కోసం ప్రభుత్వాలు స్వాధీనం చేసుకోవడానికి వీలులేదని తేల్చిచెప్పింది.


న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్): ఏకపక్షంగా వ్యక్తుల ఆస్తులను స్వాధీనంచేసుకునే హక్కు ప్రభుత్వాలకు లేదని, ప్రైవేటు ఆస్తుల స్వాధీనం విషయంలో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. ప్రైవేటు యాజమాన్యంలోని అన్ని ఆస్తులను ఉమ్మడి ప్రయోజనం కోసం ప్రభుత్వాలు స్వాధీనం చేసుకోవడానికి వీలులేదని తేల్చిచెప్పింది. ఈ మేరకు 8:1 మెజారిటీతో సుప్రీంకోర్టు ఈ తీర్పు ఇచ్చింది. అయితే కొన్ని కేసుల్లో మాత్రం మినహాయింపు ఉంటుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది.

మిగతా 2లో

## రాష్ట్రంలో మరోమారు సమగ్రసర్వే

- నేటి నుంచే వివరాల సేకరణకు రంగం సిద్ధం
- ఆస్తులు అప్పులు మొదలు కుటుంబ వివరాల సేకరణ
- వివరాలన్నీ గోప్యంగా కంప్యూటరీకరణకు చర్యలు

రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వేను ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. సర్వేలో భాగంగా ఇంటింటికీ వెళ్లి మొత్తం 56 ప్రధాన ప్రశ్నలు వేస్తారు. వాటిలో కొన్నింటికి ఉప ప్రశ్నలు వేసి ప్రతి కుటుంబం నుంచి సమగ్రంగా సమాచారాన్ని సేకరించాలని ప్రభుత్వం గణకులకు నిర్దేశించింది.




హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వేను ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. సర్వేలో భాగంగా ఇంటింటికీ వెళ్లి మొత్తం 56 ప్రధాన ప్రశ్నలు వేస్తారు. వాటిలో కొన్నింటికి ఉప ప్రశ్నలు వేసి ప్రతి కుటుంబం నుంచి సమగ్రంగా సమాచారాన్ని సేకరించాలని ప్రభుత్వం గణకులకు నిర్దేశించింది. సర్వేలో కుటుంబ యజమాని, సభ్యుల వివరాలను నమోదు చేయడంతో పాటు కుటుంబంలోని ప్రతిఒక్కరి ఫోన్ నంబరు, వారుచేసే వృత్తి లేదా ఉద్యోగ వివరాలను సేకరిస్తారు. ఇందులో భాగంగా ఆస్తులెన్ని.. అప్పులెన్ని.. ఆదాయమెంత.. ఇంట్లో ఎంతమంది ఉంటారు.. ఎవరైనా విదేశాలకు, ఇతర రాష్ట్రాలకు వెళ్లారా.. ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యారా.. ఇలా మొత్తం 75 రకాల ప్రశ్నలతో గణకులు వివరాలను సేకరించేలా ప్రశ్నావళిని రూపొందించారు. ఉన్నత చదువు లేదా ఉద్యోగం, వ్యాపారం, పెళ్లి లేదా ఇతర అవసరాలకు వెళ్లారా..

2లో



## 25నుంచి పార్లమెంట్ సమావేశాలు

కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వెల్లడి

న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నవంబర్ 25 నుంచి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 20 వరకు కొనసాగనున్నాయి.

మిగతా 2లో




## కాంగ్రెస్ పాలనలో గురుకులాల్లో 36 మంది మృతి

- ఏడునెలల్లో 600 మందికిఫుడ్ పాయిజనింగ్
- గురకుల పాఠశాలల్లో కనీస వసతులు మృగ్యం
- ప్రభుత్వం తీరుపై మండిపడ్డ హరీష్ రావు

హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్): ఇప్పటి వరకు ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లలో 36 మంది విద్యార్థులు వివిధ కారణాలతో చనిపోయారని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. 36 మంది విద్యార్థుల మరణాలు అంటే చిన్న విషయం కాదన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. దాదాపు 600 మంది విద్యార్థులు

## ఇంటర్ పరీక్ష ఫీజుల తేదీ ప్రకటన



## ఏకపక్షంగా ఆస్తుల స్వాధీనం కుదరదు

(మొదటి పేజీ తరువాయి)

ప్రైవేటు వ్యక్తుల ఆస్తులను సమాజ వనరుగా పరిగణించొచ్చా అన్న కీలక కేసుపై కొద్దినెలల క్రితం ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఏ ప్రైవేటు ఆస్తి సమాజ వనరు కాదు.. అన్ని ప్రైవేటు ఆస్తులూ సమాజ వనరులే.. ఈ రెండు పరస్పర భిన్నమైన విధానాలు. వీటిపై ప్రస్తుత ప్రైవేటీకరణ, జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సమకాలీన వ్యాఖ్యానం చేయాల్సిన అవసరం ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. 1950లో భారతదేశాన్ని దృష్టిలో ఉంచుకొని ఇప్పుడు వ్యాఖ్యానం చేయకూడదు. అప్పుడు జాతీయీకరణ జరుగుతోంది. ఇప్పుడు పెట్టుబడుల ఉపసంహరణ జరుగుతోంది. ప్రైవేటు పెట్టుబడులు ఉన్నాయి. ఇది పరివర్తన. కాబట్టి న్యాయస్థానం వ్యాఖ్యానం కొత్తగా ఉండాలి. ప్రస్తుత భారత్‌కు అనుగుణంగా ఉండాలి. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోవాలని ధర్మాసనం పేర్కొంది. తాజాగా ఈ వ్యాఖ్యలను పునరుద్ఘాటిస్తూ దీనిపై తీర్పు వెలువరించింది. అలాగే కోల్‌కతాలో పార్కు నిర్మాణం కోసమంటూ స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ ఓ వ్యక్తి ఆస్తిని స్వాధీనం చేసుకున్న కేసులోనూ సుప్రీం తీర్పునిస్తూ.. చట్టప్రకారం మున్సిపల్ కార్పొరేషన్ నష్టపరిహారం చెల్లించినా సరైన పద్ధతులు మాత్రం పాటించలేదు. వ్యక్తుల ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించినప్పటికీ రాజ్యాంగం తగిన రక్షణ కల్పించింది. నిర్బంధ స్వాధీనాలు, హడావుడి నిర్ణయాలు, న్యాయబద్ధంగాలేని పరిహారాల కారణంగా పౌరులు నష్టపోవడానికి చట్టం అనుమతించబోదని ధర్మాసనం తెలిపింది. ఆస్తి స్వాధీనం విషయాన్ని ముందుగా తెలియజేయడం, తగినంత సమయం ఇవ్వడం, అభ్యంతరాలు స్వీకరించడం, వాటిని పరిష్కరించడం, పునరావాసం కల్పించడం, ప్రజాప్రయోజనం కోసమేనని వివరించడం వంటివన్నీ ప్రభుత్వాలు చేయాల్సి ఉంటుందని పేర్కొంది.

# రాష్ట్రంలో మరోమారు సమగ్రసర్వే

(మొదటి పేజీ తరువాయి)

అని కుటుంబ యజమానిని గణకులు అడుగుతారు. విదేశాల్లో యూకే, అమెరికా, గల్ఫ్, ఆస్ట్రేలియా, కెనడాలతో పాటు ఐరోపా దేశాలకు వెళ్లినట్లు చెబితే ఒక్కో దేశానికి ఒక ప్రత్యేక కోడ్ నమోదు చేస్తారు. మరే దేశానికి వెళ్లినా ఇతర దేశం అనే కోడ్ నమోదు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ నుంచి ఎందరు వలస వెళ్లారు.. ఏ కారణంతో బయటకు వెళ్లారనే సమగ్ర సమాచారం సేకరించడానికి ఈ ప్రశ్నలు రూపొందించినట్లు తెలుస్తోంది.ప్రజలు తీసుకున్న రుణాలపై ప్రత్యేకంగా మూడు ప్రశ్నలు అడుగుతారు. గత ఐదేళ్లలో ఏమైనా అప్పులు తీసుకున్నారా.. ఎందుకు తీసుకున్నారు.. ఎక్కడి నుంచి రుణం పొందారు.. అనే ప్రశ్నలను ప్రతి కుటుంబాన్ని అడగాలని నిర్ణయించారు. బ్యాంకులు, స్వయంసహాయక సంఘాల నుంచే కాకుండా వడ్డీ వ్యాపారుల నుంచి తీసుకున్నారా అనే వివరాలను కూడా చెప్పాలి. కుటుంబ సభ్యులందరి స్థిర, చరాస్తుల వివరాలన్నీ చెప్పాలి. చరాస్తుల వివరాలను వేర్వేరుగా నమోదు చేస్తారు. వీటిలో బైకు, స్కూటర్, సొంత అవసరాలకు వాడే కారు, కిరాయికి తిప్పుతున్న కారు వంటివి ఉన్నాయా? వాషింగ్ మిషన్, ఫ్రిజ్, ఏసీ, టీవీ, స్మార్ట్‌ఫోన్ ఇలా మొత్తం 18 రకాల చరాస్తుల వివరాలన్నీ చెప్పాలి. ఒక కుటుంబంలోని సభ్యులందరికీ కలిపి ఇవన్నీ ఎన్ని ఉన్నాయి.. వాటి విలువ ఎంత అనేది తెలపాలి. మీ ఇల్లు ఎన్ని గజాల్లో.. ఏ ప్రాంతంలో ఉంది? ఇంటిలో ఉన్న మొత్తం గదులెన్ని.. బాత్‌రూం, మరుగుదొడ్డి ఉన్నాయా ఇలాంటి వివరాలన్నీ చెప్పాలి. మీకు ఎంత భూమి, ఎన్ని ఎకరాల్లో ఉంది.. అది పట్టా భూమా? లేదా ప్రభుత్వం ఇచ్చిన ఎసైన్డ్ లేదా పట్టాలేని అటవీ భూమా.. వంటి వివరాలు కూడా సేకరిస్తారు. గత ఐదేళ్లలో ఏమైనా సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందారా? ఆ పథకాల పేర్లు ఏమిటి? వంటి వివరాలు సేకరిస్తారు. కుటుంబంలో ఎవరైనా ప్రజాప్రతినిధిగా

ఎన్నికయ్యారా.. ఎన్నికైతే రిజర్వేషన్‌లోనా, ఎన్ని పర్యాయాలు అనేది చెప్పాలి. రాష్ట్రపతి, ప్రధాని తప్ప మిగతా ఏ హోదాలో ప్రజాప్రతినిధిగా పనిచేసినా వివరాలు చెప్పాలి. వార్డు సభ్యుడి నుంచి కేంద్రమంత్రి, గవర్నర్, సీఎం దాకా ఏ పదవి పొందినా సరే నమోదు చేయించాలి.సర్వే సమయంలో గణకులు కుటుంబాల నుంచి స్పష్టమైన సమాచారాన్ని తీసుకోవాలి. ప్రతి ఇంట్లో నివసించే కుటుంబసభ్యుల సంఖ్య తీసుకోవాలి. సర్వే ఫారంలో ఇంటి నంబరు, యజమాని పేరు వంటి వివరాలు నమోదు చేయాలి. సర్వే పూర్తయిన ఇంటిగోడపై స్టిక్కర్ అతికించాలి. సర్వే చేసిన తర్వాత ఫారాల్లో నమోదు చేసిన వివరాలను కంప్యూటర్లో నిక్షిప్తం చేయాలి. ఈ పక్రియ చాలా కీలకం. డేటాఎంట్రీ సమర్థంగా నిర్వహిస్తేనే విశ్లేషణ కచ్చితత్వం సాధిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రణాళికశాఖ జిల్లా, మండలాల్లో అవసరమైన డేటాఎంట్రీ ఆపరేటర్లను గుర్తించి, వారికి శిక్షణ పూర్తిచేసింది. ప్రతిరోజూ గణకులు తీసుకువచ్చిన వివరాల్ని నమోదు చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ఆపరేటర్లు నమోదు చేస్తున్న వివరాలను సూపర్‌వైజర్ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు.సర్వే సమయంలో కుటుంబం నుంచి తీసుకున్న సమాచారం విషయంలో గోప్యత పాటించాలని ప్రభుత్వం స్పష్టంగా ఆదేశించింది. ఈ విషయాన్ని గణకులు ముందుగానే యజమానికి వివరిస్తారు. ఎక్కడా ఈ సమాచారం బయటపెట్టరని హామీ ఇస్తారు. ఫారంలోని వివరాలన్నీ నింపిన తర్వాత వాటిని జాగ్రత్తగా భద్రపరుస్తారు. గణకులు వివరాలను డేటాఎంట్రీ కేంద్రంలోని ఆపరేటర్‌కు ఇచ్చి వాటిని పూర్తిచేయిస్తారు. ఆ సమయంలోనూ ఫారాలను గోప్యంగా ఉంచడంతో పాటు ఆ డేటాను ఇతరులతో పంచుకోకుండా జాగ్రత్త వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. రోజువారీ నిర్వహించిన సర్వే వివరాలు, పురోగతిని సాయంత్రం 6 గంటల్లోపు ప్రణాళికశాఖకు పంపించాలి.రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే అంటే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేయడానికి శాసనసభ తీర్మానం మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి అవసరమైన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలు మెరుగు పరిచేందుకు, అన్నివర్గాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపింది. ఈ సర్వేకు ప్రణాళికశాఖ నోడల్ విభాగంగా వ్యవహరిస్తోంది. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ సర్వే జరగనుంది. జిల్లా, మండల నోడల్ అధికారులు.. ఎన్యూమరేషన్ బ్లాక్(ఈబీ)ల గుర్తింపు, గణకుల నియామకం, ఇళ్ల జాబితా, డేటా ఎంట్రీతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాల్సి ఉంటుంది.



## ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి

(మొదటి పేజీ తరువాయి)

ఇందిరా పార్క్ వద్ద ఆటో డ్రైవర్ల మహాధర్నాలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందని ఎన్నడూ అనుకోలే దన్నారు. గత పదేళ్లలో కేసీఆర్ హయాంలో అభివృద్ధి ఫలాలు అనుభవించామని రోజుకు దాదాపు రూ. 2 వేలు సంపాదించే పరిస్థితి ఉండేదని ఆటో డ్రైవర్లు చెప్పారు. ఇప్పుడు రూ. 200 నుంచి రూ. 300 కూడా సంపాదించలేని పరిస్థితి వచ్చిందని ఆటోడ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. గతేడాది రాహుల్ గాంధీ వచ్చి ఆటో ఎక్కి ఆటో డ్రైవర్ల సమస్యలు తీరుస్తానని రంగుల కల చూపించారు. నెలకు వెయ్యి రూపాయలు ఇస్తామన్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. మనం మంచి కార్యక్రమాలకు వ్యతిరేకం కాదు. మహాలక్ష్మి పేరుతో మహిళలకు రూ. 2500 ఇస్తా అన్నారు. వాటిని ఇవ్వాలని కోరుతున్నాం. కానీ గత 11 నెలల్లో వీళ్లు చెప్పిన దానికి చేసిన దానికి ఎంత తేడా ఉందో?ఏం మార్పు వచ్చిందో ఒక్కసారి ఆలోచించాలని ఆటో అన్నలను కోరుతున్నాని కేటీఆర్ పేర్కొన్నారు. రైతులు, నేత కార్మికులు, ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు ఈ ప్రభుత్వం వచ్చాక ప్రారంభ మయ్యాయి.ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందని ఎప్పుడూ అనుకోలేదన్నారు. శాసన సభలో ఆత్మహత్యలు చేసుకున్న వారి పేర్లతో సహా మేము చెప్పాం. వాళ్ల కుటుంబాలను కూడా ఆదుకోలేదు. ఉచిత బస్సు ప్రయాణానికి మేము వ్యతిరేకం కాదు. కానీ మీరు ఆటో డ్రైవర్లకు ఇస్తా అన్న నెలకు వెయ్యితో పాటు రూ. 5 వేలు నెలకు ఇవ్వాలని కోరుతున్నా. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డును వచ్చే శాసనసభ సమావేశాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించాలి. థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్‌ను ఆటో డ్రైవర్లు కావాలని కోరుతున్నారు. ప్రభుత్వం ఈ డిమాండ్‌ను నెరవేర్చాలి. మా ప్రభుత్వం తెచ్చిన ఇన్సూరెన్స్‌ను తీసివేసే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. అది సరికాదు. కేంద్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇబ్బంది పెట్టేలా చట్టం చేసింది. అది కూడా రద్దు చేయాలి. గతంలో కాంగ్రెస్ పార్టీ మీకు చాలా హామీలు ఇచ్చి?మీ నోట్లో మట్టి కొట్టింది. రాహుల్ గాంధీ చెప్పిన తియ్యని, కమ్మని మాటలు గుర్తు చేసుకోవాల్సిన అవసరముంది అని కేటీఆర్ పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లు ఇక్కడకు ఎక్కువ మంది రాకుండా పోలీసులు ప్రయత్నం చేశారు. దయచేసి పోలీసులు అలా చేయవద్దు. ఎందుకంటే మిమ్మల్ని మీతోనే కొట్టించే పరిస్థితి తీసుకువచ్చారు. పోలీసులు డ్యూటీలు చేయండి. కానీ పేద వాళ్ల పట్ల దయతో ఉండండి. సెక్యూరిటీ లేకుండా బయటకు వెళితే రేవంత్ రెడ్డిని తన్నే పరిస్థితి ఉంది. అందుకే ఆయనకు భయం పట్టుకుంది. నల్గొండలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఉన్న కాంగ్రెస్ పార్టీ సభలో కాంగ్రెస్ నాయకుడే మనం బయటకు వెళితే తన్నే పరిస్థితి ఉందని చెప్పాడు. మనం ఇచ్చిన హామీలు ఒక్కటి నెరవేర్చలేదని చెప్పాడు. రేవంత్ రెడ్డికి పోలీసుల మీద కూడా నమ్మకం లేక సెక్యూరిటీలో నుంచి బెటాలియన్ పోలీసులను తీసేశారు. నిరుద్యోగులు, రైతులు, వృద్ధులు, మహిళలు అందరినీ కాంగ్రెస్ మోసం చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. ఎన్ని కేసులు పెట్టినా, జైల్లో పెట్టినా సరే ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల కోసం పోరాడతాం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని మనం కోరుతున్నాం. కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం అందరూ కలిసి పోరాటం చేయాల్సిన అవసరముంది. మీ తరఫున శాసనసభలోనూ మేము పోరాటం చేస్తాం. మీడియా కూడా భయపడకుండా పోరాటం చేసే వాళ్ల సమస్యలకు మద్దతుగా నిలవాలని కోరుతున్నానని కేటీఆర్ తెలిపారు.

## కాంగ్రెస్ పాలనలో గురుకులాల్లో 36 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఏడు నెలల్లో ఫుడ్ ఫాయిజనింగ్ బారిన పడ్డారని.. అంతేకాకుండా పాములు, ఎలుకల కాట్లకు గురవుతున్నారన్నారు. నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గురుకుల పాఠశాల బాలికలను హరీష్‌రావు మంగళవారం పరామర్శించారు. కొమరం భీం జిల్లా వాంకిడి మండల గిరిజన బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో ఫుడ్‌పాయిజన్‌తో 60 మంది బాలికలు అస్వస్థతకు గురవగా.. వారిలో ముగ్గురు విద్యార్థినిల పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. చికిత్స పొందుతున్న విద్యార్థినిల్లో ఒకరు వెంటీలేటర్‌పై చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. ధైర్యంగా ఉండాలని విద్యార్థినిల తల్లిదండ్రులకు చెప్పానన్నారు. గత పదకొండు నెలల కాంగ్రెస్ పాలనలో తల్లిదండ్రుల నమ్మకాన్ని పోగొట్టే విధంగా ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లలో పరిస్థితులు దిగజారిపోయాయని మండిపడ్డారు. గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలన కల్పనలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కరెంట్ షాక్‌లు కూడా కామన్ అయిపోయాయన్నారు. ఇటీవలనే మెదక్ హవేలీ ఘన్ పూర్ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో పిల్లలకు కరెంట్ షాక్ తగిలి హాస్పిటల్‌లో చేరాల్సి వచ్చిందన్నారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినప్పటికీ దున్నపోతు మీద వాన పడ్డట్లు సర్కార్ వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం, మంత్రులు మహారాష్ట్ర ,ఝార్ఖండ్ ఎన్నికల బిజీగా ఉన్నారని.. రెసిడెన్షియల్ స్కూళ్ల పై పట్టించుకునే తీరిక వారికి లేదన్నారు. రెసిడెన్షియల్ ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితిపై అప్పటికప్పుడు చర్యలు తీసుకోవడం కాదు.. శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. 36 మంది రెసిడెన్షియల్ విద్యార్థుల మరణాలు ప్రభుత్వం చేసిన హత్యలే అని ఆరోపించారు. ఈ మరణాలపై ప్రభుత్వంలో ఏ స్థాయిలోనూ సమీక్షలు జరగడం లేదన్నారు. కేసీఆర్ హాయాంలో 1023 ప్రభుత్వ గురుకులాలు ఏర్పాటు అయ్యాయని తెలిపారు. ప్రతి విద్యార్థిపై సంవత్సారానికి లక్షా 20 వేల రూపాయలు కేసీఆర్ వెచ్చించారని తెలిపారు.

## సరస్వతీ ప్లాంట్ భూములకు రక్షణ

(మొదటి పేజీ తరువాయి)



మంగళవారం పల్నాడు జిల్లాలోని మాచవరం మండలం.. వేమవరం, చెన్నాయపాలెం గ్రామాల్లోని సరస్వతి పవర్ ప్లాంట్ భూములను ఆయన పరిశీలించారు. అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. వైఎస్ఆర్ హయాంలో ఈ సరస్వతి పవర్ ప్రాజెక్ట్ తీసుకు వచ్చారని గుర్తు చేశారు. ఈ ప్రాంతంలో 400 ఎకరాల అటవీ భూములుంటే.. వాటిని రెవెన్యూ భూములుగా మార్చేసి లాక్కున్నారని పవన్ కల్యాణ్ ఈ సందర్భంగా మండిపడ్డారు. 2009లో ఈ భూములను 30 ఏళ్లకు లీజుకు తీసుకుని.. మళ్లీ వాటిని 50 ఏళ్లకు పెంచారని చెప్పారు. తాము పరిశ్రమ ఏర్పాటు చేసి.. అందులో ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి.. ఈ భూములు విక్రయించేలా నాటి పెద్దలు నమ్మబలికారన్నారు. ఇష్టం లేకున్నా.. ఈ భూములు అమ్మాల్సిన పరిస్థితి తీసుకు వచ్చారని వివరించారు. అందుకోసం ప్రజలు, రైతులపై తీవ్ర ఒత్తిడి తీసుకు వచ్చారన్నారు. క్రమంలో పెట్రోల్ బాంబులు వేసి వారిని భయపెట్టారని గుర్తు చేశారు. ఇక ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావును వేధించి వేధించి చంపేశారన్నారు. ఫర్నిచర్‌పై కోడెలను వేధించిన వ్యక్తి.. ఎ÷–లాంట్ పేరుతో భూములు లాక్కున్నారంటూ వైఎస్ జగన్‌పై పవన్ కల్యాణ్ మండిపడ్డారు. ఎస్సీ కుటుంబాలకు చెందిన 24 ఎకరాల భూమిని భయపెట్టి మరీ తీసుకున్నారని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వివరించారు.లా లాక్కున్న భూముల్లో 20 ఎకరాలు వేమవరంలోనే ఉన్నాయని చెప్పారు. అయితే ఎవరైనా ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే మాత్రం ఊరుకునేది హెచ్చరించారు. అలాగే 24.78 ఎకరాల కుంటలు, చెరువులు స్వాధీనం చేసుకున్నారని వివరించారు. అలా భూములు లాక్కొని సొంత ఆస్తి మాదిరిగా కుటుంబంలో కొట్టుకుంటున్నారని డిప్యూటీ సీఎం వ్యంగ్యంగా పేర్కొన్నారు. సహజ వనరులు ఒకరి సొత్తు కాదు.. ఒకరి సొంతం కాదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఇక పోలీస్ ఉన్నతాధికారులు సైతం మెత్తబడిపోయారన్నారు. లేకుంటే వారు సైతం భయపడుతున్నారా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. స్థానిక యువతను గత ప్రభుత్వంలోని వారు భయపెడితే ఊరుకుంటారా? పెట్రోల్ బాంబులు, నాటు బాంబులు వేసి బెదిరిస్తుంటే ఏం చేస్తున్నారంటూ ఈ సందర్భంగా పోలీస్ ఉన్నతాధికారులను డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. ప్రజలను కాపాడాల్సిన బాధ్యత పోలీసులది కాదా? రౌడీయిజాన్ని అరికట్టాల్సిన బాధ్యత పోలీసులదని పవన్ కల్యాణ్ గుర్తు చేశారు. వైసీపీ నాయకులు ఇంకా తమ ప్రభుత్వమే అధికారంలో ఉన్నదన్నట్లుగా ప్రవర్తిస్తున్నారంటూ నిప్పులు చెరిగారు.

## 25నుంచి పార్లమెంట్ సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మంగళవారం వివరాలు వెల్లడించారు. ఈ సెషన్‌లో భాగంగా నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. సంవిధాన్ సదన్ (పార్లమెంట్ పాత భవనం) సెంట్రల్ హాల్ ఇందుకు వేదికకానుంది. ప్రస్తుతం మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలపై అన్ని పార్టీలు దృష్టి సారించాయి. నవంబర్ 23న ఫలితాలు వెల్లడికానున్నాయి. ఆ తర్వాతే ఈ సెషన్ ప్రారంభంకానుంది. ఈ సమావేశాల్లోనే కేంద్రం వక్ఫ్ బిల్లును ప్రవేశపెట్టనుందని తెలుస్తోంది. గత సెషన్‌లోనే కేంద్రం ఈ బిల్లును తీసుకువచ్చింది. అయితే విపక్షాలు దీనిపై తీవ్ర నిరసన వ్యక్తంచేయడంతో కేంద్రం ఒక్క అడుగు వెనక్కివేసి..దానిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపింది.

# అణువణువునా కుల వివక్ష: రాహుల్‌గాంధీ

(మొదటి పేజీ తరువాయి)

కార్పొరేట్ కంపెనీలు, న్యాయ వ్యవస్థ, రాజకీయ రంగం.. ఇలా ప్రతిచోటా ఉన్న ఈ వివక్ష దేశ ప్రజల భవిష్యత్తుపై ప్రభావం చూపుతోందని, దేశంపై వారి నమ్మకాన్ని దెబ్బతీస్తోందని అన్నారు. తాను వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం లేదని, కులవివక్షను అందరూ అంగీకరించి దేశ వాస్తవ పరిస్థితిని ప్రజల ముందు ఉంచాల్సిందేనని స్పష్టం చేశారు. కులంతో కూడిన అసమానత చాలా దారుణమని, దళితులను ముట్టుకోని పరిస్థితులు ప్రపంచంలో మరెక్కడా ఉండవని చెప్పారు. టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన మంగళవారం బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో కులగణనపై రాష్ట్రస్థాయి సంప్రదింపుల సదస్సు జరిగింది. ఈ సదస్సుకు రాహుల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 'కుల వివక్ష ఎంత తీవ్రస్థాయిలో ఉందో దేశ ప్రజల ముందు ఉంచుదాం. ఇది కూడా ఎక్స్‌రే లాంటిదే. కుల వివక్షపై మాట్లాడితే దేశాన్ని నేను విభజించేందుకు ప్రయత్నిస్తున్నానని బీజేపీ నేతలు, దేశ ప్రధాని మోదీ విమర్శిస్తున్నారు. దేశ వాస్తవ పరిస్థితిని బయటపెడితే అది విభజించడమా? దేశంలో దళితులు, ఓబీసీలు, ఆదివాసీలు, మైనార్టీలు, మహిళలు, ఇతర కులాల వారు ఎంతమంది ఉన్నారో తెలుసుకోవాలి. ఆ తర్వాత సంపద ఎలా పంపిణీ చేయాలో నిర్ణయించుకోవాలి. కార్పొరేట్ కంపెనీలు, న్యాయవ్యవస్థ, సైన్యంలో ఎంతమంది ఏ వర్గాల వారున్నారో అడగాలి. ఈ ప్రశ్నలను అడిగేందుకు ఎందుకు భయపడుతున్నారు? నిజాన్ని తొక్కిపెట్టాలనుకునే వారు, దీని గురించి దేశం తెలుసుకోకూడదని అనుకుంటున్నవారే ఈ ప్రశ్నలను అడ్డుకుంటున్నారు. వీరంతా కుల వివక్ష కారణంగా లబ్ధి పొందినవారే. దేశంలో కుల వివక్షను నిర్మూలిస్తానని ప్రధాని మోదీ బహిరంగంగా ఎందుకు చెప్పలేకపోతున్నారు? దేశంలోని కార్పొరేట్ కంపెనీల్లో ఎంతమంది దళితులు, న్యాయవ్యవస్థలో ఎంత మంది ఓబీసీలు, మీడియాలో ఎంతమంది ఆదివాసీలు పనిచేస్తున్నారో తెలుసుకునేందుకు మోదీ ఎందుకు ఇష్టపడడం లేదో చెప్పాలి..' అని రాహుల్ డిమాండ్ చేశారు. 'కులగణనకు తెలంగాణ మోడల్ అవుతుంది. ఈ అంశంలో తెలంగాణ నాయకత్వం చాలా బాగా పనిచేసింది. అయితే బ్యూరోక్రాటిక్ కులగణన వద్దు. ఈ కులగణనలో అడిగే ప్రశ్నలు అధికారులు ఎక్కడో కూర్చుని రాసేవి కాకూడదు. అదే జరిగితే ప్రజలను అవమానించడమే అవుతుంది. కులగణనలో ఏ ప్రశ్నలు అడగాలో దేశ ప్రజలే చెప్పాలి.

## ఇంటర్ పరీక్ష ఫీజుల తేదీ ప్రకటన

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): ఇంటర్ ఎగ్జామ్ ఫీజు తేదీలు షెడ్యూల్ వచ్చింది. ఈ నెల 6వ తేదీ నుంచి 26వ తేదీ వరకు విద్యార్థులు ఫీజు చెల్లించాలి. రూ. 100 ఆలస్య రుసుంతో నవంబర్ 27 నుంచి డిసెంబర్ 4వ తేదీ వరకు చెల్లించొచ్చు. రూ. 500 ఆలస్య రుసుంతో డిసెంబర్ 5 నుంచి 11 వరకు, రూ. 1000 ఆలస్య రుసుంతో డిసెంబర్ 12 నుంచి 18 వరకు, రూ. 2 వేల ఆలస్య రుసుంతో డిసెంబర్ 19 నుంచి 27 వరకు చెల్లించే అవకాశం కల్పించారు. ఫస్టియర్ జనరల్ కోర్సులకు రూ. 520, వొకేషనల్ కోర్సులకు రూ. 750, సెకండియర్ జనరల్ ఆర్ట్స్ కోర్సులకు రూ. 520, సైన్స్, వొకేషనల్ కోర్సులకు రూ. 750గా ఫీజు నిర్ధారించారు.

## కొనసాగుతున్న ఎమ్మెల్యే పాల్వాయి దీక్ష

### అటవీ అధికారులపై చర్యకు డిమాండ్

**కొమురంభీం,(క్రైమ్ మిర్రర్):** అటవీ అధికారులపైచర్యతీసుకోవాలని కోరుతూ చేపట్టిన ఎమ్మెల్యే పాల్వాయి దీక్ష కొనసాగుతున్నది. సిర్పూర్ (టి ) అటవీ శాఖ కార్యాలయం ముందు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు నిరాహార దీక్ష కొనసాగుతోంది. ఈ దీక్ష రెండురోజులుగా కొనసాగుతోంది. సోమవారం నుంచి ఎమ్మెల్యే దీక్ష చేస్తుండటంతో ఆయన ఆరోగ్యంపై బీజేపీ నేతలు ఆందోళన చెందుతున్నారు. వైద్యులు ఎమ్మెల్యేను పరీక్షించారు. బెంగాలీ క్యాంపు రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి, అక్రమ కేసులు పెట్టిన అటవీ అధికారులపై చర్యలకు ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. అమాయక రైతులపై అటవీశాఖ దాడులు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునేదాకా దీక్ష విరమించేది లేదని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు స్పష్టం చేశారు.కాగా.. వారం రోజుల క్రితం మండలంలోని బెంగాలీ క్యాంపునకు చెందిన ఏడుగురిపై అక్రమంగా కేసుపెట్టి చితకబాధిన అటవీశాఖ అధికారుల తీరును నిరసిస్తూ నిరాహారదీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో సైతం అటవీశాఖ అధికారులు వన్యప్రాణులను చంపారన్న నెపంతో లక్షలు వసూలు చేసి కాగజ్‌నగర్ డీఎఫ్‌వోకు కట్టబెట్టారని ఆరోపించారు. అలాగే కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో కేంద్ర ప్రభుత్వం నుంచి అటవీశాఖకు మంజూరైన కంపా నిధులలో అటవీ అధికారులు లక్షలరూపాయల అవినీతికి పాల్పడ్డారని అవికూడా బహిర్గతం చేయాలన్నారు. అటవీశాఖ అధికారులపై రాష్ట్ర, మంత్రి, మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు తెలిపారు.

## ఆటో బోల్తా:తప్పిన ప్రాణాపాయం

**సిద్దిపేట, (క్రైమ్ మిర్రర్):** సిద్దిపేట జిల్లాలో ఘోర ప్రమాదం తప్పింది. ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో 10 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన దుబ్బాక శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విద్యార్థులను తీసుకొని స్కూల్‌కు వెళ్తుండగా దుబ్బాక శివారులోకి ఆటో రాగానే అదుపుతప్పి బోల్తా పడింది. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను దుబ్బాక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## బేస్‌బాల్‌ఆడుతూ విద్యార్థి మృత్యువాత

**నిర్మల్,(క్రైమ్ మిర్రర్):** బేస్ బాల్ ఆడుతూ ఓ విద్యార్థి మృత్యు ఒడిలోకి చేరాడు. ఈ విషాదకర సంఘటన మంగళవారం ఉదయం నిర్మల్ జిల్లాలో చోటు చేసుకుంది. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎంజేపీ పాఠశాలలో తొమ్మిదవ తరగతి విద్యార్థి ఫయాజ్ హుస్సేన్ ఉదయం బేస్ బాల్ ఆడుతూ అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన ఉపాధ్యాయులు వెంటనే ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు విద్యార్థి మృతి చెందినట్లు ధృవీకరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## రాహుల్ స్వాగతంలో అంబనీతో ఉన్న ప్లెక్సీలు

### కావాలనే చేశారని మండిపడుతున్న అనుచరులు




**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ రాష్ట్రంలో పర్యటించనున్న సందర్భంగా ఆయనకు స్వాగంతం పలుకుతూ కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో బ్యానర్లు, ప్లెక్సీలు ఏర్పాటు చేశారు. వాటిలో ప్రముఖ పారిశ్రామిక వేత్త అదానీతో కలిసి రేవంత్ రెడ్డి దిగిన ప్లెక్సీలు కూడా ఉన్నాయి. అయితే కొందరు వీటిని కావాలనే ఏర్పాటుచేసినట్లు అర్థంఅవుతోంది. దీనిపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అదానీ కంపెనీతో ఒప్పందం చేసుకోవడం, పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించడం జరిగింది. అయితే రామన్నపేటలో అంబానీకి చెందిన అంబూజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదని స్థానికులు మండిపడుతున్నారు. ఇది అంబానీ- రేవంత్ బంధానికి నిదర్శణమని చెబుతున్నారు. ఈ క్రమంలో కొందరుకావాలనే ఇలాంటి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు అర్థం అవుతోంది.

## చెట్టును ఢీకొన్న విద్యార్థులతో వెళుతున్న ఆటో

### 13మంది విద్యార్థులకు తీవ్ర గాయాలు

**సిద్దిపేట,(క్రైమ్ మిర్రర్):** విద్యార్థులను పాఠశాలలకు తరలించే ఆటో అదుపుతప్పి చెట్టుకు ఢీకొన్న ఘటనలో 13 మంది విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణ శివారులో చోటు చేసుకుంది. దుబ్బాక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కమ్మర్ పల్లి గ్రామానికి చెందిన 13 మంది విద్యార్థులు దుబ్బాక పట్టణంలోని రెండు ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్నారు. ఈ క్రమంలో కమ్మర్ పల్లి నుంచి 13 మంది విద్యార్థులతో బయలుదేరిన ఆటో పట్టణ శివారు చికోడు వద్ద అదుపు తప్పి చెట్టుకు ఢీ కొట్టింది. ఈ ఘటనలో బాబు, సుదర్శన్, రోహిత్, యశ్వంత్‌తో పాటు మరో ముగ్గురికి తీవ్ర గాయాలైనాయి. మరో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన ఏడుగురిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్వల్ప గాయాలతో బాధపడుతున్న 6 మంది విద్యార్థులను దుబ్బాకలోని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ అజాగ్రత్త వల్లే ప్రమాదం చోటు చేసుకుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఆయా పాఠశాలల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులకు నచ్చజెప్పి శాంతింప చేశారు.

## హైదరాబాద్ నగరంలో

# మరో దారుణం

### మహిళపై దారుణంగా సామూహిక అత్యాచారం

### మహిళ ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** హైదరాబాద్ నగరంలో మరో దారుణం జరిగిం. మరో మహిళ సామూహిక అత్యాచారానికి గుయ్యింది.పనికోసం వచ్చిన ఆ మహిళ మృగాళ్ళను నమ్మి వెళ్లి అత్యాచారానికి గురయ్యింది. పొట్ట కూటి కోసం భవన పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఎప్పటిలాగే సోమవారం కూడా ఆ మహిళ పనికి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చే సమయంలో అనుకోని ఆపద ఆమెను చుట్టుముట్టింది. ముగ్గురు వ్యక్తుల మాయ మాటలు చెప్పి పని ఉందని తమవెంట తీసుకుని వెళ్లారు. తీరా అక్కడికి తీసుకుని వెళ్లి సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. హైదరాబాద్‌లోని మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ దారుణం చోటు చేసుకుంది. ఓ కార్మికురాలిపై ముగ్గురు కామాంధులు దారుణంగా అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలు ఓ భవనంలో పని చేస్తోంది. ఉదయం పనికి వెళ్లిన మహిళ సాయంత్రం భవనంలో పని ముగించుకుని ఇంటికి బయలుదేరింది. హైటెక్ సిటీ క్రాస్ రోడ్డు వద్ద బస్సు కోసం మహిళ ఎదురు చూస్తోంది. ఈ క్రమంలో ఎప్పటి నుంచో ఆమెపై కన్నేసిన ముగ్గురు కామాంధులు ఆటోలో ఆమె వద్దకు వచ్చారు. ఆమెకు మాయ మాటలు చెప్పి వాళ్లతో తీసుకెళ్లారు. ఆపై దారుణానికి పాల్పడ్డారు. తమ ఇంట్లో బట్టలు ఉతికే పని ఉందని మహిళకు చెప్పారు. దీంతో బట్టలు ఉతికితే డబ్బులు వస్తాయని ఆశ పడి వారిని నమ్మి వెళ్లింది. ముగ్గురు వ్యక్తులు ఆటోలో మహిళను మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తాము ఉంటున్న రూంకు తీసుకువచ్చారు. ఆపై మహిళపై అతి దారుణంగా అత్యాచారానికి పాల్పడ్డాడు. కామాంధుల



అఘాయిత్యంతో మహిళ గట్టిగా కేకలు వేసింది. దీంతో పక్కనే ఉన్న ఓ మహిళ అక్కడకు వచ్చి జరుగుతున్న దారుణాన్ని చూసి అవాక్కయ్యింది. అయితే మహిళ రావడాన్ని చూసిన ముగ్గురు వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. ఆపై బాధితురాలు తనకు జరిగిన అన్యాయం గురించి సదరు మహిళకు చెప్పి భోరున విలపించింది. దారుణాన్ని చూసిన సదరు మహిళ మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన మధురానగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధిత మహిళను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పరారైన ముగ్గురు వ్యక్తుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## కారు బీభత్సం మహిళ మృతి

**సూర్యాపేట, (క్రైమ్ మిర్రర్):** కారు బీభత్సం సృష్టించిన ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. ఈ విషాద సంఘటన సూర్యాపేటలో చోటుచేసుకుంది. మంగళవారం మునగాల మండలం మాధవరం వద్ద వేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపుతప్పి.. పాదచారులు, ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఓ మహిళ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు వెంటనే అంబులెన్స్ ద్వారా సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి క్షతగాత్రుల తరలించారు. సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించిన పోలీసులు.. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని చెప్పారు.

## దాశరథిని స్మరించుకున్న కెసిఆర్



**హైదరాబాద (క్రైమ్ మిర్రర్):** నా తెలంగాణ కోటి రతనాల వీణ అని నినదించిన తెలంగాణ కవి రచయిత దాశరథి కృష్ణమాచార్య వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వారి సేవలను స్మరించుకున్నారు. తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు కోసం సాగిన ఉద్యమంలో దాశరథి అందించిన పోరాట స్ఫూర్తి ఇమిడివుందన్నారు. దాశరథి కృషిని గుర్తించిన నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం వారి స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించటానికి పలు కార్యక్రమాలు చేపట్టిందని కేసీఆర్ గుర్తుచేశారు.

# శోక నగరాన్ని సందర్శించండి

### రాహుల్ రాక సందర్భంగా హరీష్ రావు పోస్ట్



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** హైదరాబాద్‌కు వస్తున్న రాహుల్ గాంధీ ముందుగా అశోక్‌నగర్ వెళ్లాలని మాజీమంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాహుల్‌ను ఉద్దేశిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశారు. హైదరాబాద్‌కు వస్తున్న రాహుల్ గాంధీ.. అశోక్‌నగర్ వెళ్లాలని.. అక్కడి నిరుద్యోగ యువతను కలవాలని.. ఆ యువత పట్ల ప్రభుత్వం ఎలా ప్రవర్తించిందో చూడాలంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో మాజీ మంత్రి పోస్టు చేశారు. ఇటీవల గ్రూప్-1 విద్యార్థుల ఆందోళనలతో హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో తీవ్ర హైటెన్షన్ వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. జీవో నెంబర్ 29ను రద్దు చేసి జీవో నెం 55ను అమలు చేయాలంటూ నిరుద్యోగులు ఆందోళనకు దిగారు. పెద్ద ఎత్తున నిరుద్యోగులు నిరసనకు దిగడంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీంతో పోలీసులు వారిని అడ్డుకోవడంతో పాటు అరెస్టులు చేశారు. పలు చోట్ల లాఠీచార్జ్‌లు కూడా జరిగాయి. నిరుద్యోగుల ఆందోళన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం హైదరాబాద్‌కు వస్తున్నారు. ఈ నేపథ్యంలో రాహుల్‌ను ఉద్దేశిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశారు మాజీ మంత్రి హరీష్‌రావు. అశోక నగరాన్ని సందర్శించండి రాహుల్ గాంధీ.. మీరు ఎన్నికల ముందు అశోక్ నగర్‌లో నిరుద్యోగ యువతను కలిసిన ప్రదేశంలోనే, మీ సో-కాల్డ్ ప్రజా పాలన విద్యార్థులపై కర్కశంగా వ్యవహరించింది. లాఠీ చార్జ్ చేసి వీపులు పగలగొట్టింది. ఈ దారుణాలు మీకు తెలుసా. హైదరాబాద్‌కు వస్తున్న మీరు ఒకసారి అశోక్ నగర్‌ను సందర్శించి ఆ విద్యార్థులతో మాట్లాడి.. వారి ఆవేదనను వినండి, శోక నగర్‌గా మార్చిన మీ ప్రభుత్వ తీరును చూడండి. మీరు వాగ్దానం చేసిన 2 లక్షల ఉద్యోగాల్లో కనీసం 10? ఉద్యోగ నోటిఫికేషన్లు కూడా ఇవ్వలేదు. టీఎస్పీఎస్సీని యూపీఎస్సీ తరహాలో ప్రక్షాళన చేస్తామని ప్రకటించారు, ప్రక్షాళన సంగతి దేవుడెరుగు, టీఎస్పీఎస్సీని టీజీపీఎస్‌గా పేరు మార్చి చేతులు దులుపుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పారు, కానీ అది కేవలం జాబ్‌లెస్ క్యాలెండర్‌గా మిగిలిపోయింది. పది నెలల కాలంలో నిరుద్యోగ భృతి, 5 లక్షల రూపాయల యువ వికాసం పథకం వంటి హామీల ఊసు కూడా లేదు. నిరుద్యోగుల పట్ల, విద్యార్థుల పట్ల మీరు మీ పార్టీ చూపిన కపట ప్రేమ బట్టబయలైంది. కాంగ్రెస్ ప్రభుత్వ కర్కశ పాలనను నిరుద్యోగ యువత తప్పకుండా గుర్తుపెట్టుకుంటుందని అంటూ ఎక్స్‌లో హరీష్‌రావు పోస్టు చేశారు.

## ఎన్వీఎస్ ప్రభాకర్‌పై పరువు నష్టం కేసు

### నాంపల్లి కోర్టుకు హాజరైన దీపాదాస్ మున్షీ

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** బిజెపి నేత, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై ఏఐసీసీ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షి పరువునష్టం కేసు దాఖలుచేశారు. ఈ కేసు కోసం మంగళవారం ఆమె నాంపల్లి క్రిమినల్ కోర్టుకు హాజరయ్యారు. బీజేపీ నేత ప్రభాకర్ చేసిన వ్యాఖ్యల విషయంలో ఆమె పరువునష్టం కేసు వేశారు. ఈ పిటిషన్ పై నాంపల్లి కోర్టు విచారణ జరుపుతోంది. ఈ నేపథ్యంలో దీపాదాస్ మున్షి కోర్టుకు హాజరయ్యారు.ఆమెకు మద్దతుగా కాంగ్రెస్ ఎంపీలు, మాజీ ఎంపీలు కార్యకర్తలు నాంపల్లి కోర్టుకు వచ్చారు. బీజేపీ నేత ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై దీపాదాస్ మున్షి పరువునష్టం కేసు వేయగా, ఈ పిటిషన్‌పై నాంపల్లి కోర్టు విచారణ చేస్తోంది. అయితే పలుమార్లు కోర్టుకు బీజేపీ నేత ప్రభాకర్‌గౌర్హాజరయ్యారు. ప్రభాకర్ చేసిన ఆరోపణలకు ఆధారాలతో కోర్టుకు హాజరవ్వాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేయడంతో నాంపల్లి కోర్టులో బీజేపీ నేత ప్రభాకర్ హాజరయ్యారు. అయితే ఈకేసును డిసెంబర్ 5వ తేదీకి నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. తెలంగాణ బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తనపై చేసిన అవినీతి ఆరోపణలపై ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. తాను 'క్విడ్ ప్రో కో'కు పాల్పడ్డానంటూ గతంలో ప్రభాకర్ చేసిన ఆరోపణలపై దీపాదాస్ మున్షీ పరువునష్టం దావా వేసిన విషయం తెలిసిందే. ఎన్నికల సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్‌లో టికెట్ల కోసం పలువురు నేతలు ఆమెకు బెంజ్ కార్లు గిఫ్ట్‌గా ఇచ్చారంటూ ప్రభాకర్ చేసిన ఆరోపణలు సంచలనంగా మారాయి.

## బిర్యాని తిని యువతి మృతి.. మరో నలుగురు సీరియస్

బోథ్, నవంబర్ 5: నిర్మల్‌లోని ఏఎన్‌రెడ్డి కాలనీలో గల గ్రిల్ నైన్ మల్టీ కుజైన్ రెస్టారెంట్‌లో బిర్యానీ తిని అస్వస్థతకు గురైన యువతి ఫూల్ ఖలీ బైగా(19) మంగళవారం మృతి చెందింది. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచ్చెర క్రాస్ రోడ్డులో గల సెయింట్ థామస్ స్కూల్‌లో పనిచేస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ స్మిత, ఫాదర్ దీపక్, వైఎస్ ప్రిన్సిపాల్ సోఫీ, ఉపాధ్యాయురాలు సిజి, వంట మనిషి ఫూల్ ఖలీ బైగాలు ఈ నెల 2న నిర్మల్‌లోని గ్రిల్ నైన్ మల్టీ కుజైన్ రెస్టారెంట్‌లో చికెన్-65, తందూరి చికెన్, చికెన్ ఫ్రైడ్ రైస్ తిన్నారు. ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురయ్యారు. ఈ నెల 3న పాఠశాల యాజమాన్యం బోథ్‌లోని సీహెచ్‌సీలో చేర్పించింది. వాంతులు, విరేచనాలు కావడంతో చికిత్స అనంతరం వారిని ఇంటికి తీసుకెళ్లారు. మళ్లీ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఈ నెల 5న మరోసారి సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఫూల్ ఖలీ బైగా మంగళవారం మృతి చెందిం ది. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో కామారెడ్డికి తరలించారు. గ్రిల్ నైన్ మల్టీ కుజైన్ రెస్టారెంట్‌పై పాఠశాల యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

## ఎడిటోరియల్



# జార్ఖండ్‌లో పొత్తులే కీలకం

ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న జార్ఖండ్‌లో ఇప్పుడు పాలక జెఎంఎం సహకారం లేకుండా ఏమీ చేయలేని స్థితిలోకి కాంగ్రెస్ పార్టీ వెళ్లిపోయింది. సర్ఫరాజ్ అహ్మద్, సుబోధ్ కాంత్ సహాయ్, ఫుర్కాన్ అన్సారీ, రాజేందర్ సింగ్, చంద్రశేఖర్ దూబే వంటి నాయకులతో కలకలలాడిన కాంగ్రెస్ ఇప్పుడు బలం తగ్గిఉంది. పొత్తులు ఫలించడం, సంక్షేమ పథకాలు సానుకూలించడంతోపాటు సోరెన్ అరెస్టుతో రాష్ట్రంలో వ్యక్తమైన సానుభూతి పాలక 'జెఎంఎం', 'ఇండియా' కూటమికి కలసి వస్తోందని భావిస్తున్నారు. బిజెపికి బయపడి, పార్టీ మార్పిళ్ల నుంచి కాపాడుకోవడానికి సిఎం తమ ఎంఎల్ఎలను రెండు మార్లు ఛత్తీస్‌గఢ్‌లో క్యాంపుల్లో పెట్టాల్సి వచ్చింది. ఇకపోతే 2019లో చేజారిన జార్ఖండ్‌ను తిరిగి పొందడానికి బిజెపి ఆదివాసీల మనసు గెలిచే సకల యత్నాలూ చేస్తోంది. జెఎంఎం బలంపై గట్టిగా దెబ్బకొట్టాలనే పట్టుదలతో పని చేస్తోంది. చేసిన తప్పును సరిదిద్దుకుంటున్న భావన జార్ఖండ్ ప్రజల్లోకి వెళ్లేలా, బిజెపి గెలిస్తేఊ డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి సాగుతుందని ప్రచారంలో చెబుతున్నారు. ఆదివాసీయేతర నాయకుడు రఘుబర్దాస్‌ని ముఖ్యమంత్రి చేసి ఆదివాసీల కోపానికి కారణమైనట్లు పార్టీ నాయకత్వం గ్రహించింది. అలాగే హేమంత్ సోరెన్ పై కేంద్ర దర్యాప్తు సంస్థల కేసు, అరెస్టుతో అది మరింతగా బలపడి, బిజెపి ఆదివాసీలకు వ్యతిరేకం అన్న భావన కలిగింది. అయితే ముర్మను రాష్ట్రపతిని చేయడం కొంత కలసి వస్తోంది. జార్ఖండ్‌లో ఏ కూటమినైనా.. అంతిమంగా పొత్తులే గట్టెక్కించాలి. ఏ ఒక్కరూ సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయగల ప్రజామద్దతు కూడగట్టే స్థితిలో లేరు. పొత్తుల్లో గెలిచి ప్రభుత్వాలు ఏర్పరచడం, విడిగా పోటీ చేసినపుడు ఓడి విపక్షంలో కూర్చోవడం.. ఈ అనుభవం ఇటు బిజెపి, అటు జెఎంఎం ఇద్దరికీ ఉంది. అందుకే పొత్తుల్ని ఖరారు చేసుకొని కూటమిగానే బరిలో దిగుతున్నారు. 81 స్థానాలున్న రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవసరమైన మ్యాజిక్ నంబర్ 41. పార్టీల మధ్య పొత్తుతో పాటు సామాజిక సమీకరణాలపైన దృష్టిపెట్టి, గెలుపే లక్ష్యం చేసుకుంటున్నారు. 2014లో విడిగా పోటీచేసి 25స్థానాలు గెలిచిన జెఎంఎం, కాంగ్రెస్‌లు 2019 ఎన్నికల్లో కలిసి పోటీచేసి 47 స్థానాలు గెలిచి, ప్రభుత్వం ఏర్పరిచారు. 2014లో ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఎజెఎస్‌యు)తో పొత్తు పెట్టుకొని 42 సీట్లు నెగ్గిన బిజెపి, 2019లో పొత్తులు బెడిసి 25 సీట్లకు పరిమితమైంది. ప్రభుత్వం పోయింది. 16శాతం జనాభాగా ఉన్న కుర్మీ మహతోల్లో పట్టున్న ఎజెఎస్‌యు కనీసం 14 అసెంబ్లీ సీట్లలో ప్రభావం చూపుతుంది. రాష్ట్రంలోని 7 జిల్లాలు, 20 సీట్లలో ప్రభావం గల ముస్లీంలు సుమారు 15 శాతంగా ఉన్నారు. ఒబిసి జనాభా 46శాతం ఉంది. అందుకే, బిజెపి(68), ఎజెఎస్‌యు(10), జెడి(యు)(2), ఎల్‌జెపి(1) కలిసి పోటీ చేయాలని సయోధ్యతో ఉన్నాయి. 'ఇండియా' కూటమిలోనూ సీట్ల పంపకాలు జరిగినా.. మూడు స్థానాల్లో మిత్రపక్షాల అభ్యర్థులే పరస్పరం పోటీలో ఉండే పరిస్థితి తలెత్తింది. జెఎంఎం (43), కాంగ్రెస్ (30), రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి)(5), సిపిఐ-ఎంఎల్ (3) పార్టీలు కలిసి మొత్తం 81 స్థానాల్లో పోటీ చేయాలనుకున్నారు. కానీ, కాంగ్రెస్‌కు కేటాయించిన రెండు సీట్లలో ఆర్‌జెడి, సిపిఐ-ఎంఎల్‌కు కేటాయించిన ఒక చోట కాంగ్రెస్.. పొత్తులకు విరుద్ధంగా పోటీలో దిగుతున్నాయి. ఇన్ని సంక్లిష్టతల మధ్య జార్ఖండ్ గెలుపు ఎవరిని వరించనున్నదో నవంబరు 23 న తేలనుంది. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో 14లో 9 సీట్లు ఎన్‌డియే కూటమి గెలిచినప్పటికీ, 5 ఎస్‌టి రిజర్వుడు సీట్లలోనూ ఓడిపోయింది. అందుకే, ఈసారి గెలిస్తే ఆదివాసీయే ముఖ్యమంత్రి అనే సంకేతాలు ఇవ్వడానికి బిజెపి నాయకత్వం యత్నిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయినా.. కొందరు ఆదివాసీ ముఖ్యనేతలను అసెంబ్లీ బరిలోకి దింపుతోంది. గీతాకోడ , సీతాసోరెన్ , అర్జున్ ముండా, చాంపయ్ సోరెన్ , జెఎంఎం మాజీ ఎంఎల్ఎ లోబిన్ ఎంబ్రామ్ వంటి వారు రంగంలో ఉన్నారు. ఆదివాసీ ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో 10, 12 అసెంబ్లీ సీట్లయినా గెలవాలనేది బిజెపి పట్టుదలగా కనిపిస్తోంది. పార్టీలోకి సరయురాయ్ తిరిగి రావడం కలిసొచ్చే అంశమని నాయకత్వం భావిస్తోంది. ఇదే అదనుగా కాంగ్రెస్ కూడా ఎదురుదాడి ప్రచారం చేస్తోంది. బిజెపి గిరిజన, ఆదివాసీ వ్యతిరేకి అనీ ప్రచారం చేస్తోంది. సిఎం హేమంత్ సోరెన్ అరెస్టయి జైల్లో ఉన్న సమయంలో ఆయన సతీమణి కల్పనా సోరెన్ విస్తృతంగా జనంలో తిరిగి కేంద్రానికి వ్యతిరేకంగా ప్రచారం చేశారు. బొగ్గు రాయల్టీలు ఇవ్వకుండా, రాష్ట్రంపై వివక్ష చూపుతూ కేంద్రం సహకరించక పోవడమేకాక, ఆర్థికంగా జార్ఖండ్‌ను దెబ్బకొట్టే కుట్రలు చేస్తోందనీ చేసిన ప్రచారం ప్రజల్లోకి వెళ్లింది. మయ్యా సమ్మాన్ యోజనతో పాటు రూ. 3584 కోట్ల మేర విద్యుత్ బిల్లుల మాఫీ, రూ.400 కోట్ల మేర రైతు వ్యవసాయ రుణ మాఫీ, డిసెంబర్ నుంచి స్టయిఫెండ్‌ను రూ.2500కి పెంచుతామన్న హామీతో ప్రజల్లో సానుకూలత పెరిగిందని భావిస్తున్నారు. కాంగ్రెస్, జెఎంఎం నుంచి ఎన్నికల ముందు బిజెపిలోకి వెళ్లిన పలువురు నేతలు తిరిగి రావడాన్ని ఓ సానుకూలాంశంగా 'ఇండియా' వర్గాలు భావిస్తున్నాయి.



# ప్రతిష్టాత్మకంగా మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలు !

ఈ నెలలోనే పలు రాష్ట్రాలకు ఎన్నికలు జరుగబోతున్నాయి. అలాగే యూపి, పంజాబ్, వయనాడ్‌లలో ఉప ఎన్నికలు కూడా ఉన్నాయి. ఓ రకంగ చెప్పాలంటే హర్యానా, కాశ్మీర్ ఎన్నికల తరవాత జరుగుతున్న ఈ ఎన్నికలు మోడీకి, రాహుల్‌కు పరీక్ష లాంటివి. అలాగే మహారాష్ట్రలో కూడా ఎన్నికలు బిజెపి కూటమికి సవాల్‌గానే చూడాలి. కాంగ్రెస్ కూటమి అక్కడ బలంగానే ఉంది. ఇకపోతే జార్ఖండ్‌లో కూడా బిజెపి ఎత్తులు వేసి హేమంత్ సోరెన్‌ను ముప్పుతిప్పలు పెట్టింది. కేసుల్లో జైలుకు తోసింది. తిరిగి బయటకు వచ్చాక కూడా స్థిరంగా పాలన చేసుకునే పరిస్థితి లేదు. ఈ నెల 20న మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలు జరగ నున్నాయి. ఆ రాష్ట్ర ప్రజలే కాదు, యావద్దేశ జనులూ ఈఎన్నికల ఫలితాలు ఎలా ఉండనున్నాయనే ఉత్కంఠతో ఉన్నారు. మహారాష్ట్రలోను, విశాల భాతదేశంలోను ప్రజలంతా ఇక్కడి ఎన్నికలపై ఆసక్తిగా చూస్తున్నారు. 'లడ్కీ బహిన్' పేరుతో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం సరికొత్తగా అమలు పరుస్తున్న 'సంక్షేమ' పథకం గట్టెక్కిస్తుందని నమ్మకంగా ఉన్నారు. సంవత్సరాదాయం రూ. రెండున్నర లక్షల కంటే తక్కువగా ఉన్న ప్రతి కుటుంబానికి నెలా నెలా ఆ కుటుంబ గృహిణికి రూ.1500 బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఈ ఉదార ఆర్థిక హామీయమే చర్చనీయాంశంగా ఉన్నది. అయితే అది ఒక నిర్ణాయకమైన రాజకీయ ప్రశ్నను కూడా లేవనెత్తుతున్నది. తెలంగాణలో కూడా ఎన్నికల ముందు రెండున్నర వేలు ఆడిబిడ్డ ఖాతాలో వేస్తామని ఇలాంటి హామీనే ఇచ్చారు. రాష్ట్రాల్లో లేదా కేంద్రం లో మరోమారు అధికారం కోసం ఎన్నికల ముందు ఇలాంటి హామీలు ఇవ్వడం అన్నది సర్వసాధారణంగా మారింది. ఓ రకంగా చెప్పాలంటే క్విడ్‌ప్రోకో లాంటిదే. తాయిలాలు ప్రకటించడం...ఎన్నికల్లో గెలవడం అన్నది కొత్త పరిభాషగా మారింది. బిజెపి కూడా ఇదే కోవలో ప్రయాణం చేస్తోంది. పేదలకు లేదా మహిళలు, లేదా బడుగు బలహీన వర్గాల ఓట్లను గంపగుత్తగా దక్కించుకునేందుకు ఇలాంటి ఎత్తుగడలు వేస్తున్నారు. నగదు సహాయం పేరిట లంచాలు ఇవ్వడం ఇదే మొదటిసారి కాదు. ఓటర్లకు ప్రత్యక్ష నగదు చెల్లింపులు చేయడం అన్నది ఎన్నికల్లో జరుగుతూనే ఉంది. ఈ క్రమంలోనే మహారాష్ట్ర ఎన్నికల్లో ఏక్‌నాథ్ షిండే తన అధికారం నిలుపుకునేందుకు లడ్కీ బహిన్ పథకం తీసుకుని వచ్చారు. ఇలా ఆర్థిక సహాయం అందించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం నెలకు ఇంచుమించు రూ.3700 కోట్లు వెచ్చించనున్నది. వార్షికంగా రూ.46 వేల కోట్ల భారం ఆ రాష్ట్ర ప్రభుత్వంపై పడనున్నది. మహారాష్ట్ర ప్రభుత్వ రుణభారం ఇప్పటికే రూ.7.8 లక్షల కోట్లుగా ఉన్నదని అంచనా. ప్రతిపక్ష కూటమి మహా వికాస్ అగాఢీని చిత్తుచేసేందుకు ఉద్దేశించిన తెలివైన రాజకీయంగా దీనిని చెప్పుకోవాలి. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో పాలక మహాయుతి కూటమి రాష్ట్రంలోని 48 ఎంపి సీట్లలో కేవలం 17ను మాత్రమే గెలుచుకోగలిగింది. ఈ కారణంగా ఓటర్ల బృందాలను ఆకట్టుకునే క్రమంలో లడ్కీ బహిన్ పథకాన్ని ఏక్‌నాథ్ షిండే ప్రకటించారు. మహిళలు, యువత లక్ష్యంగా లడ్కీ బహిన్, నిరుద్యోగ యువతకు 'లడ్కా భావు' పేరిట నగదు సహాయం చేసేందుకు షిండే సర్కార్ నిర్ణయించింది. లోక్‌సభ ఎన్నికలలో ప్రతిపక్ష ఇండియా కూటమి రాజ్యాంగం ప్రమాదంలో పడిందన్న నినాదంతో బిజెపిని ముచ్చెమటలు పోయించింది. ఈ ప్రమాదం నుంచి తప్పించుకునే క్రమంలో ఇప్పుడు షిండే ప్రభుత్వం నగదు ఆధారిత పథకాలను శాసనసభ ఎన్నికల ప్రధాన ప్రచారాంశంగా చేయడం గమనార్హం. ఇక జార్ఖండ్‌లోనూ ఇండియా కూటమి బాగానే పనిచేస్తోంది. ఇక్కడ సంక్షేమ పథకాల వైపు మొగ్గుతారా? సానుభూతి అంశాలకు పీటవేస్తారా? అన్నది జార్ఖండ్ ఓటర్ల మనోభావాల మీద గెలుపోటములు ఆధారపడ్డాయి. ఇద్దరి అమ్ముల పొదిలోనూ ఈ రెండంశాల విడివిడి అస్త్రాలున్నాయి.

18-50 ఏళ్ల మధ్య వయస్కులైన ప్రతి మహిళకు నెలనెలా వెయ్యి రూపాయలిచ్చే 'మయ్యా సమ్మాన్ యోజన' తో 53 లక్షల మంది లబ్దిదారులు ప్రయోజనం పొందుతున్నారు. దీంతోపాటు 200 యూనిట్లలోపు విద్యుత్ బిల్లుల మాఫీ వల్ల 40 లక్షల కుటంబాలు, వ్యవసాయ రుణాల మాఫీ వల్ల 1.7 లక్షల కుటుంబాలు తమకు సానుకూలంగా ఉన్నారని, వారే ప్రభుత్వాన్ని తిరిగి గెలిపించుకుంటారని జెఎంఎం, 'ఇండియా' నమ్మకంతో ఉంది. దీనికి ధీటుగా బిజెపి కూడా తాయిలాలను ప్రకటించింది. తాము అధికారంలోకి వస్తే ప్రతి మహిళకు కనీస నెలసరి ఆదాయం అందించడం, ఉచిత వంటగ్యాస్, ఉద్యోగ కల్పన, నిరుద్యోగ భృతి, గృహ సదుపాయం.. 'పాంచ్ ప్రాణ్' అమల్లోకి తెస్తామని బిజెపి ప్రచారం చేస్తోంది. ఇవికాకుండా.. బిజెపి ఆదివాసీ వ్యతిరేక పార్టీ అని, అందుకే ఎస్‌టిలకు ప్రాధాన్యత ఇవ్వకపోగా సిఎం హేమంత్ సోరెన్‌ను అక్రమంగా జైలుపాలు చేసిందని జెఎంఎం ప్రచారం ఉధృతం చేస్తోంది. సరిహద్దుల నుంచి వచ్చే బంగ్లాదేశ్ చొరబాటుదారుల వల్ల స్థానిక ఆదివాసీల ప్రయోజనాలకు తీవ్రభంగం వాటిల్లుతోందని, తాము అధికారంలోకి వస్తే ఈ పరిస్థితిని ఎన్‌ఆర్‌సి అమలుతో కట్టడిచేస్తామని బిజెపి చెబుతోంది. ఈ రెండు రాష్ట్రాల్లోనూ 'ఇండియా' ఎన్‌డిఎ కూటములుగా ముఖాముఖి తలపడుతున్నాయి. తెలంగాణ లాగానే జార్ఖండ్ కూడా పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుంది. 2000లో బీహార్ రాష్ట్ర విభజన జరిగి, జార్ఖండ్ ఏర్పడింది. 24 ఏళ్లలో ఇది అయిదో ఎన్నిక. నవంబరు 13, 20 తేదీల్లో రెండు విడతలుగా రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగనున్నాయి. నవంబరు 23న ఓట్ల లెక్కింపు. ప్రతి రాష్ట్ర ఎన్నిక లాగానే, జార్ఖండ్ ఎన్నికల్ని కూడా బిజెపి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. మాజీ ముఖ్యమంత్రి చాంపయ్ సోరన్ తో పాటు పలువురు పేరున్న నాయకుల్ని పార్టీలోకి తిరిగి తెచ్చుకుంది. మూడుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్న అర్జున్ ముండే ముఖ్యమంత్రి అభ్యర్థి అయ్యే అవకాశాలున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆయన ఓడిపోయారు. సోరెన్ లాగే, సంతాలీ అయిన మాజీ ముఖ్యమంత్రి బాబూలాల్ మరాండిని ఏడాది కిందటే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని చేసింది. ఈ ముగ్గురే కాకుండా మరో మాజీ ముఖ్యమంత్రి మధు కోడా సేవల్ని కూడా ఉపయోగించు కుంటోంది. రెండు నెలల వ్యవధిలో రెండు మార్లు రాష్ట్రంలో పర్యటించిన ప్రధాని నరేంద్ర మోడీ, ఎన్నికల ప్రక్రియ ముగిసే లోపు మరో ఆరేడు సార్లు పర్యటించేలా ప్రచార ప్రణాళిక రచిస్తున్నారు.

(ఆధ్యాత్మిక చింతన)

# నేడు గోవర్ధన పూజ

### భక్తి శ్రద్ధలతో శ్రీకృష్ణుడికి అన్నప్రసాదాల నైవేద్యం

రోజుల దీపావళి పండుగలో భాగంగా చివరి రోజున గోవర్ధన్ పూజ నిర్వహిస్తారు. ఉత్తరాదిలో గోవర్ధన పర్వతాన్ని ఎత్తిన కన్నయ్యను పూజించే సంప్రదాయం ఉంది. ప్రతి సంవత్సరం కార్తీక మాసంలోని శుక్ల పక్షం ప్రతిపాద తేదీ రోజున గోవర్ధన పూజ పండుగను జరుపు కుంటారు. గోవర్ధన పూజను అన్నకూట్ అని అంటే 'ఆహార పర్వతం పిలుస్తారు. ఈ రోజున హిందువులు తమ ఇళ్లలో దేవుడికి కృతజ్ఞతను తెలియజేయడానికి అనేక రకాల రుచికరమైన వంటకాలను తయారు చేసి సమర్పిస్తారు. గోవర్ధన పూజ రోజున ఆవు పేడతో గోవర్ధన మహారాజ్ విగ్రహాన్ని ఇంట్లో తయారు చేసి కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేస్తారు. ఈసారి దీపావళి రెండు రోజులు రావడంతో గోవర్ధన్ పూజ తేదీ విషయంలో గందరగోళం నెలకొంది. గోవర్ధన్ పూజను నవంబర్ 1వ తేదీన అని కొందరు నవంబర్ 2వ తేదీన అని మరికొందరు వాదించడంతో ప్రజల్లో గందరగోళం నెలకొంది. కార్తీక ప్రతిపద తిథి శుక్రవారం సాయంత్రం 6.16 గంటలకు ప్రారంభమవుతుంది. కార్తీక ప్రతిపాద తిథి నవంబర్ 2, రాత్రి 8:21 గంటలకు తేదీ ముగుస్తుంది. అటువంటి పరిస్థితిలో ఉదయ తిథి ప్రకారం గోవర్ధన పూజ 2 నవంబర్ శనివారం జరుపుకోవాలని కొందరు అంటున్నారు. గోవర్ధన పూజ రోజున వివిధ రకాల ఆహారాన్ని తయారు చేసి సమర్పించే సంప్రదాయం ఉంది. శ్రీకృష్ణుడికి అన్నకూట్‌తో పాటు 56 రకాల ఆహార పదార్ధాలను కూడా నైవేద్యంగా సమర్పిస్తారు. గోవర్ధన పూజ రోజున బ్రహ్మ ముహూర్తంలో నిద్రలేచి స్నానం చేసి శ్రీకృష్ణుడిని పూజిస్తారు. కన్నయ్య సహా అన్ని విగ్రహాలను పువ్వులు, పసుపు కుంకుమ చందనంతో అలంకరించి పూలజు చేస్తారు. కుటుంబ సమేతంగా కృష్ణుడిని స్తుతిస్తూ భజనలు చేస్తారు. దీని తర్వాత పాలు, తాంబూలం, పాల పదార్ధాలు, అన్నకూట్ మొదలైన వాటిని నైవేద్యంగా పెట్టడం ఆనవాయితీ. తర్వాత కుటుంబ సభ్యులందరితో కలిసి నీళ్లలో పాలు కలిపి ఏడుసార్లు కన్నయ్యకు ప్రదక్షిణలు చేస్తారు. ఇలా ఏడుసార్లు ప్రదక్షిణాలు చేసిన తరువాత, నెయ్యి దీపం వెలిగించి హారతి ఇస్తారు. ఇలా చేసిన తరవాత పెద్దల ఆశీర్వాదం తీసుకుంటారు. ఓ రకంగా దీపవాళి మరుసటి రోజు శ్రీకృష్ణుడిని కొలవడమే ఈ పండగ పరమార్ధతంగా చెప్పుకోవాలి.

# కరువు మండలాల గుర్తింపులో నిర్లక్ష్యం

### అనేక ప్రాంతాలను విస్మరించారన్న విమర్శలు

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల భారీ వర్షాలే కురిశాయి. నదులు పొంగాయి.. వరదలు బీభత్సం సృష్టించాయి. కృష్ణమ్మ ఇప్పటికీ ఉత్సాహంగా ఉరకలెత్తుతోంది. అయినా పలుచోట్ల ఇంకా వర్షాభావం నెలకొంది. దీంతో పలు కరువు మండలాలను ప్రకటించక తప్పలేదు. ఖరీఫ్ పంట కాలంలో కీలకంగా భావించే జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో తీవ్ర వర్షాభావం నెలకొనగా ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించింది. గత ఖరీఫ్‌లో 300 మండలాలకు పైన కరువు పరిస్థితులుండగా గత వైసిపి సర్కారు 103 మండలాలలనే గుర్తించింది. వైసిపి ప్రభుత్వం తక్కువ మండలాలను ప్రకటించిందని నాడు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి కూటమి విమర్శించింది. నేడు అధికారంలోకొచ్చాక గత ప్రభుత్వ విధానాన్నే కొనసాగించింది. దుర్భిక్షాన్ని అంచనా వేసి బాధితులను ఆదుకునేందుకు ప్రకటించాల్సిన కరువు మండలాలను తగ్గించింది. రాయలసీమలోని ఐదు జిల్లాల్లో కేవలం 54 మండలాల్లోనే కరువును గుర్తించింది. వాటిలోనూ తీవ్ర స్థాయి, మధ్యస్త స్థాయి అని రెండు కేటగిరీలుగా విభజించింది. కరువు మాన్యువల్ ప్రకారం మండలాలను గుర్తించామని సర్కారు చెబుతున్నా వాస్తవంలో అదేమీ కనిపించట్లేదన్న విమర్శలు ఉన్నాయి. సగటు గణాంకాల ప్రకారం సాధారణ వర్షపాతం నమోదైంది. జిల్లాల సరాసరి కూడా అలాగే ఉంది. నెలల వారిగా, మండలాల వారీగా చూస్తేనే వాస్తవం బోధ పడుతుంది. జూన్‌లో జూన్‌లో 61 మండలాల్లో, జులై 210, ఆగస్టు 196, సెప్టెంబర్ 217 మండలాల్లో సాధారణం కంటే తక్కువ వర్షం కురిసింది. జులైలో 58, ఆగస్టు 35, సెప్టెంబర్ 68 మండలాల్లో అత్యల్ప (వర్షపులోటు 60 శాతం పైన) వర్షం నమోదైంది. కానీ ప్రభుత్వం ఈ అంశాలను పరిశీలనలోకి తీసుకోలేదు. జూన్-సెప్టెంబర్ వరకు మూడు మాసాల్లో మొత్తం కురిసిన వర్షపాతాన్ని గుర్తించింది. ఆ ప్రకారం జూన్ చివరికి 61, జూలై చివరికి 38, ఆగస్టు చివరికి 38, సెప్టెంబర్ చివరికి 54 మండలాల్లో తక్కువ వర్షం కురిసినట్లు పరిగణనలోకి తీసుకొని, ఆ మేరకే కరువు మండలాలను ప్రకటించినట్లు లెఫ్ట్ పార్టీలు మండిపడుతున్నాయి. కరువు మండలాల గుర్తింపునకు అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. వాటిలో ముఖ్యమైన వర్షపాతంను ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎపిలో 679 మండలాలుండగా ఖరీఫ్ ముగిసే సెప్టెంబర్ నెలాఖరు నాటికి 347 మండలాల్లో వర్షాభావం ఉన్నాయని ప్రభుత్వ నివేదికలున్నాయి. ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, కిందికొస్తే బాపట్ల, పల్నాడు మొదలుకొని ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ వ్యాప్తంగా డ్రైస్పెల్ మండలాలు గణనీయ సంఖ్యలో ఉన్నాయి. ఆ అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. ఖరీఫ్ పంటల సేద్యానికి, తొలకరి వానలకు సాగు చేసిన పంటల ఎదుగుదలకు జులై, ఆగస్టు, సెప్టెంబర్ అత్యంత కీలకం. సరిగ్గా అప్పుడే పలు మండలాల్లో డ్రైస్పెల్స్ నెలకొన్నాయి. జులై చివరికి 113 మండలాల్లో డ్రైస్పెల్స్ వచ్చాయి. ఆగస్టు ఆఖరికి 244 మండలాల్లో డ్రైస్పెల్స్ నెలకొనగా 234 మండలాల్లో సింగిల్, పది మండలాల్లో డబుల్ డ్రైస్పెల్స్ వచ్చాయి. సెప్టెంబర్ చివరాఖరికి 347 మండలాల్లో డ్రైస్పెల్స్ నెలకొన్నాయి. అప్పటికి 242 మండలాల్లో సింగిల్, 102 డబుల్, మూడు మండలాల్లో ట్రిపుల్ డ్రైస్పెల్స్ నెలకొన్నాయి. రాయలసీమలో మొత్తం 249 మండలాలుండగా ఖరీప్ చివరాఖరికి 180 మండలాల్లో డ్రైస్పెల్స్ ఉన్నాయి. కడప జిల్లాలో మొత్తం 36 మండలాలుండగా జులై నాటికి 19, ఆగస్టు నాటికి 26, సెప్టెంబర్ ఆఖరికి 31 మండలాల్లో డ్రైస్పెల్స్ ఉండగా ఆ జిల్లాలో ఒక్క మండలాన్ని కూడా ప్రకటించలేదు. నంద్యాల, తిరుపతి జిల్లాలదీ అదే తీరు. సీమలో ప్రకటించిన జిల్లాల్లోనూ చాలా తక్కువ ప్రకటించారు. ఉదాహరణకు అనంతపురంలో 27 మండలాల్లో డ్రైస్పెల్స్ ఉంటే కేవలం 7 ప్రకటించారు. ప్రకాశం, నెల్లూరు, శ్రీకాకుళం, పల్నాడు, విజయనగరం, అనకాపల్లిలో డ్రైస్పెల్ మండలాలున్నప్పటికీ ఒక్క మండలాన్ని కూడా గుర్తించలేదు.

# ప్రజల సమస్యలు అంటే అధికారులకు పట్టవా..?

## నిర్మించ తలపెట్టిన డాక్టర్ బాబా సాహెబ్ భవనానికి మోక్షమెప్పుడో...?

## గతంలో శ్మశానవాటికకు ఉన్న స్థలం మున్సిపాలిటీగా ఏర్పడిన తరువాత మటుమాయం..






**గండిపేట్(క్రైం మిర్రర్):** ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ అన్నారు. భారత రాష్ట్ర సమితి మణికొండ సీనియర్ నాయకులు గుట్టమీది నరేందర్, గోరుకంటి విఠల్, మల్లేష్, ప్రకాష్‌ల ఆధ్వర్యంలో సామూహికంగా కార్యకర్తలు, నాయకులు నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణలో అంతర్ భాగంగా మణికొండ మున్సిపాలిటీ కౌన్సిల్ పుప్పాలగ్‌గూడలో ఎగుడు, దిగుడులతో పాటు గుంతల మయంగా ఉన్న రహదారులు, సమస్యలను పర్యటించి తెలుసుకున్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని మణికొండ మున్సిపాలిటీ కమీషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీతారామ్ ధూళిపాళ మాట్లాడుతూ విద్యుత్ సరఫరా, కటకటగా ఉన్న మంచినీటి సరఫఱా, మురుగు నీటి డ్రైనేజీ పారుదల సమస్యలతో ఇక్కట్లు పాలవుతున్న ప్రజల ఇతి బాధలను గమనించాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడు బస్తీలు, కాలనీల్లో పర్యటించిప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారన్నారు. ప్రజాస్వామ్య పద్దతిలో ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ప్రమాణం చేయడానికి ఉపయోగించే భారత రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరున పుప్పాలగూడ వార్డు ఆఫీసు స్థలంలో భవనం కట్టడానికి 2019లో 45 లక్షల బడ్జెట్‌తో శిలాఫలకం వేయడం అందరికి తెలిసిందే కానీ అట్టి బడ్జెట్ ఏ వైపునకు దారి మల్లిందో ఎవరికి తెలుసు అన్నారు. తూ తూ మంత్రంగా వెసిన పుప్పాలగూడ బస్తీ దవాఖానా ఎప్పుడు చూసినా మూసే ఉంటుందని ప్రజాభిప్రాయ సేకరణలో తేలిందన్నారు. అందుకు గానుసంబంధిత అధికారులు వివరాలను తెలియ పరచాలని, మరి ముఖ్యంగా తాతల నాటి కాలం నుంచి పుప్పాలగూడ గ్రామ పంచాయతీ ఏలుబడి వరకు స్మశాన వాటికకు నర్సింహ్మా స్వామి దేవాలయంను ఆనుకోని బండ్ల బాట ద్వారా వెళ్లే వారని మున్సిపాలిటీ ఏర్పడ్డ తరువాత అట్టి రహదారిని మూసి వేసి ఆ ప్రకన్న ఉన్న గవర్నర్‌మెంట్ స్థలంను ఆక్రమించుకోని పక్కా ఇండ్లు కట్టడాలను కట్టడి చేయలేని పరిస్థితిలో మున్సిపల్ అధికారులున్నారన్నారు. స్థానిక ప్రజలు ఆవేధనతో వెల్లడిస్తున్నారన్నారు. సంబంధిత ప్రభుత్వ అధికారులు స్పందించి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనాన్ని వెంటనే నిర్మించాలని, ప్రజాభిప్రాయాన్ని గౌరవించి శ్మశానవాటికకు వెళ్లడానికి పునజనులకు వీలు కల్పింపచి సరైన రహదారిని వేయాలని కోరడం జరిగిందన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే ప్రజల సహకారంతో తోడ్పాటుతో పార్టీ తరపున చట్ట పరిధిలో ధర్నా చేపట్టి తమ నిరసనను బహిరంగ పరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభగళ్ల ధనరాజ్, కౌన్సిలర్ ఆలస్యం నవీన్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకులు ముత్తంగి లక్ష్మయ్య, అందె లక్ష్మణ్‌రావు, సంగం శ్రీకాంత్, బొమ్మూ ఉపేంద్రనాథ్‌రెడ్డి, శ్రీబాబు, సంతోష్, రమేష్, అశోక్, సుమన్, మహేందర్, యాలాల కిరణ్, రాజేంద్రప్రసాద్, విజయలక్ష్మి, దిలీప్, షేక్ ఆరిఫ్, భానుచందర్, సయ్యద్ రఫీక్, కె.ప్రవీణ్, ఎల్లాస్వామి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**మున్సిపల్ సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి**




**గండిపేట్(క్రైం మిర్రర్):** మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని మున్సిపల్ సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ దుర్గాకన్వెన్షన్ వద్ద మండల కార్యదర్శి టి.ఆనంద్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ %ఉ% ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్లో అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ , ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చెప్పడం జరిగింది. రాష్ట్రాలలో ఎక్కడ కూడా అమలు చేయడం లేదు తెలంగాణ రాష్ట్రంలో సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. కార్మికుల అందరిని పర్మినెంట్ చేసేంతవరకు కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు కూడా పెంచాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్మికులకు క్యాజువల్ లీవ్ లు అమలు చేయాలన్నారు. అదేవిధంగా జాతీయ పండుగ సెలవుల్ని ఇవ్వాలన్నారు. పారిశుద్ధ్యం పనులు చేస్తున్నటువంటి కార్మికులని చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన చెందారు. రాష్ట్రంలో మంత్రులు , ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు, అధికారులు వస్తున్నారంటే ముందుగా మున్సిపల్ కార్మికుల చేత అని పనులు చేయిస్తారన్నారు. అలాంటి కార్మికులకు కనీస వేతనాలు ఇంప్లిమెంట్ చేయకపోవడం దారుణం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. మైలార్ దేవ్ పల్లి డివిజన్ మున్సిపల్ సంగం కమిటీని జిల్లా ప్రధాన కార్యదర్శి జైపాల్ రెడ్డి 21 మందితో కమిటీని ప్రతిపాదించడం జరిగింద. కార్మికులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులు: వై సాయిలు , ఉపాధ్యక్షులు: శేఖర్ , పెంటయ్య , సంతోష , చంద్రయ్య , ప్రధాన కార్యదర్శి: ఏ రాజు , సహాయ కార్యదర్శిలు: రంజిత్ , ఉషారాణి , మహేష్ , కౌన్సిల్ సభ్యులు: శ్యామలమ్మ , రాజు , శంకరమ్మ , మోహన్ , ఐలేష్ , యాదమ్మ , దేవేందర్, రాములమ్మ , నరేందర్ , స్వరూప , రమేష్ , కే లక్ష్మి , అందర్నీ ఎన్నుకోవడం జరిగిందన్నారు.



## ఎంజీఐటీ ఆధ్వర్యంలో రెండవ రోజు కొనసాగిన ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్...

**గండిపేట్(క్రైం మిర్రర్):** విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో నైపుణాన్ని అవలంభించుకోవాలని ఎంజీఐటీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మహాత్మ గాంధీ ఇన్సిటిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులుఎన్ఎస్ఎస్ సహకారంతో మహారాజ్‌పేట్ గ్రామంలో స్పెషల్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ స్పెషల్ క్యాంప్ రెండవ రోజు గ్రామంలోని 1వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు విద్యాబోధన, కొత్త పద్దతుల ద్వారా సబ్జెక్టులను ఏ విధంగా గుర్తుంచుకోవాలని వివరించారు. చదువు మాత్రమే సామాజిక స్థితిగతులను మారుస్తుందన్న విషయం ద్వారా నిర్వహించారు. ఈ అంశం గురించి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి ఎస్ఎస్ఎస్ విద్యార్థులు ఉద్దేశించి ప్రసంగించారు. ఆ మాటలకు స్కూల్ విద్యార్థులకు చేరేలా దిశానిర్ధేశం చేశారు. ప్రపంచాన్ని మార్చడానికి విద్యార్థులు ఉపయోగించే ఏకైక శక్తివంతమైన ఆయుధం విద్య అని అన్నారు. ఆ చిన్న మనస్సులతో ఎంతో సాధించగల శక్తి ఉందన్నారు. మీరు వారిని ఉత్తేజపరిచాలని భవిష్యత్తులో ఎలాంటి కోర్సులు ఉంటాయో తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి.బాల్‌రెడ్డి, హెచ్‌ఓడి డాక్టర్ ఎం.రవిచందర్, కోఆర్డినేటర్లు వర్మ, సుధా తదితరులు పాల్గొన్నారు.

## శివరాంపల్లిలో హింధీ ఉపాధ్యాయురాలు రూపాదేవికి డాక్టరేట్

**గండిపేట్(క్రైం మిర్రర్):** విద్యార్థుల మంచి భవిష్యత్తుకు ఉత్తమ ఉపాధ్యాయుల ప్రోత్సహం ఎంతో ఉంటుందని శివరాంపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్ అన్నారు. శివరాంపల్లి ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలు రూపాదేవి పీహెచ్‌డీ విజయవంతంగా పూర్తిచేసి డాక్టర్ రెట్ సాధించినందుకు గానూ శివారాంపల్లి ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు రూపాదేవికి అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్ మాట్లాడుతూ ఉన్నత చదువు చదువుతో పాటు సకల కళలు కలిగి శ్రమించి పని చేసేతత్వం కలిగిన రూపాదేవి మా పాఠశాలకు రావడం మా విద్యార్థుల అదృష్టం' అనీ తెలియజేశారు. పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పడమటి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ తనకు తెలిసి పాఠశాల ఈ నలబై ఏళ్ల చరిత్రలో డాక్టర్ రెట్ సంపాదించిన టీచర్లు రాలేదని, రూప నుంచీ విద్యార్థులకు స్ఫూర్తి పొంది తామూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలనీ విద్యార్థులను కోరారు. సన్మాన గ్రహీత రూపాదేవి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ 'విద్యార్థికి ఓపికను, కష్టపడే నైజం అలవర్చుకోవాలని. తెలివిని చెడు విషయాల కోసం ఉపయోగిస్తే స్వంత నాశనం తో పాటూ సమాజ నాశనానికి కారకులం అవుతామని, మంచి మార్గం కోసం ఉపయోగించి సక్సెస్ బాటలో నడవాలని' హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.







## వంద శాతం ఇంటింటి చెత్తను సేకరించాలి

**బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర**

**గండిపేట్(క్రైం మిర్రర్):** బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి ఇంటి చెత్త వంద శాతం సేకరించాలని కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. మంగళవారం 17వ వార్డు లోని ప్రశాంత్‌నగర్ కాలనీ, 18వ వార్డులోని మాంచన్‌పల్లి, 19వ వార్డులోని అభ్యుదయనగర్‌లో తడి, పోడి చెత్త సేకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఇంట్లోని చెత్తచెదారాలను ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులు అందజేయాలన్నారు. వంద శాతం ఇంటింటి చెత్త సేకరణ జరగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ జవాన్లు యాదగిరి, శ్రీధర్, సురేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర సర్వేకు సర్వం సిద్ధం

**బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర**



**గండిపేట్(క్రైం మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని 22 డివిజన్లలో అంచనా హౌస్ హోల్డ్ సంఖ్య 42,107, మొత్తం ఎన్యుమరేషన్ బ్లాక్‌ల సంఖ్య 293, సూపర్ వైజర్‌ల సంఖ్య 29, 10 శాతం రిజర్వుడ్ ఎన్యుమరేటర్లు 29 గాను 30 మందిని నియమించడం జరిగిందన్నారు. గత నెల 30వ తేదీన ఎన్యుమరేటర్ల మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించామని 4వ తేదీన రెండవ విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాఆమన్నారు. నవంబర్ 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు హౌస్ లిస్టింగ్ ఎన్యుమరేషన్ బ్లాక్‌లో ఇండ్లను గుర్తించి డోర్ స్టికరింగ్ చేయడం జరుగుతుందన్నారు. 9వ తేదీ నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించడం(సర్వే పూర్తి అయ్యే వరకు), ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే సమర్ధవంతంగా నిర్వహించేందుకు సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లను నియమించి నిర్ణిత షెడ్యూల్ ప్రకారం ఎన్యుమరేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నామన్నారు.

## రాహుల్ గాంధీకి ఘన స్వాగతం పలికేందుకు బయలుదేరిన దేప భాస్కర్ రెడ్డి

**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** బోయిన్ పల్లిలోని ఇందిరాగాంధీ ఆడిటోరియంలో తెలంగాణలో జరగనున్న కులగణన సర్వేకు దిశానిర్ధేశం చేసేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఘన స్వాగతం పలికేందుకు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బేగంపేట విమానాశ్రయానికి భారీగా పెద్ద ఎత్తున తరలి వెళ్లిన మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# రంగారెడ్డి జిల్లా దిశా కమిటీ సభ్యుడిగా నియమితులైన అంబోజి శ్రీనివాస్

## చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు,దిశా కమిటీ చైర్మన్ కొండా విశ్వేశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన తుక్కుగూడ బిజెపి శాఖ

## కేంద్ర ప్రభుత్వ పథకాలు చిట్టచివరి వ్యక్తి వరకు అందేలా కృషి చేస్తాం.అంబోజి శ్రీనివాస్




మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్): కేంద్ర గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ జిల్లా స్థాయి డెవలప్మెంట్ కోఆర్డినేషన్ మరియు మానిటరింగ్ కమిటీ ( దిశా కమిటీ ) రంగారెడ్డి జిల్లా సభ్యులుగా నియమితులైన అంబోజీ శ్రీనివాస్ సోమవారం తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ బరిగెల హేమలత రాజు గౌడ్ తో కలిసి చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు దిశా కమిటీ చైర్మన్ కొండా విశ్వేశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అంబోజి శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంతటి పెద్ద బాధ్యతను ఇచ్చినందుకు కొండా విశ్వేశ్వర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలు చిట్టచివరి వ్యక్తి వరికి అందేలా కృషి చేస్తామని అన్నారు.అనంతరం రంగారెడ్డి జిల్లా రూరల్ అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డిని,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ అందెల శ్రీరాములుని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గంగాపురం వెంకట్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, తుక్కుగూడ మున్సిపల్ కౌన్సిలర్లు శివకుమార్ గౌడ్, రాజామోని రాజు ముదిరాజ్,బోధ యాదగిరి రెడ్డి,బాకీ విలాస్,మున్సిపల్ ప్రధాన కార్యదర్శి కృష్ణ గౌడ్,బిజెపి సీనియర్ నాయకులు తలారి శ్రీనివాస్,నార్ల కంటి బాలరాజ్, శ్రీశైలం యాదవ్,బుర్ర కొండల్ గౌడ్,లాలం కొండల్ యాదవ్,బిజెపి మరియు బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

# సదర్ సమ్మేళనం పోస్టర్ల ఆవిష్కరించిన మంత్రి




చిట్యాల క్రైమ్ మిర్రర్: ఈనెల 15న నలగొండలో జరిగే సదర్ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరుకావాలని జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు మేకల యాదన్న యాదవ్ ఆహ్వాన పత్రికను అందజేశారు మంగళవారం హైదరాబాదులో మంత్రి తన నివాసంలో వాల్ పోస్టర్ను ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో చిట్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం యాదవ్, కనేబోయిన సైదులు, ఎరుపుల పరమేష్ తదితరులు పాల్గొన్నారు

# వీధి కుక్కల దాడి.. 10 గొర్రె పిల్లలు మృతి..!!



క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి: వీధి కుక్కల దాడిలో 10 గొర్రె పిల్లలు మృతి చెందాయి.ఈ ఘటన బొంరాస్ పేట మండలంలోని గట్టేగాని తండాలో చోటుచేసుకుంది. తండాకు చెందిన కేతావత్ ఫుల్ సింగ్ వ్యవసాయం చేస్తూ,గొర్రెలను కాసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.రోజు మాదిరిగానే,మంగళవారం గొర్రెలను మేపడానికి వెళ్లారు.ఇంటి దగ్గర ఎవరు లేకపోవడంతో,గంప(జల్ల)కింద ఉంచిన,గొర్రె పిల్లల దగ్గరకు కొన్ని వీధి కుక్కలు వచ్చి దాడి చేశాయి.దీంతో 10 గొర్రె పిల్లలు మృతి చెందాయి.రాత్రి ఇంటికి వచ్చిన ఫుల్ సింగ్ కి మృత్యువాత పడ్డ గొర్రె పిల్లలు కనిపించాయి.దీంతో చేసేదేమీ లేక లబోదిబోమంటూ కంటతడి పెట్టాడు. చుట్టుపక్కల తండాలలో కుక్కల బెడద నివారణకు, అధికారులు చర్యలు తీసుకోవాలని,ఆయా తండాల వాసులు కోరుతున్నారు.

## గ్రామాల్లో ఎన్నికల సందడి.సర్పంచ్ ఎన్నికలకు

# రెడీ అవుతున్న నాయకులు!




జగిత్యాలజిల్లా ప్రతినిధి (క్రైమ్ మిర్రర్): వచ్చే నెలలో ఎట్టి పరిస్థితుల్లో సర్పంచ్ ఎన్నికలు జరిపిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించడంతో ఆశావహుల్లో అలజడి మొదలైంది. జగిత్యాల. ధర్మపురి. కోరుట్ల మూడు నియోజకవర్గాలలో ఎన్నికల వాతావరణం ఊపందుకున్నది. ఎక్కడికక్కడ స్థానిక సంస్థల ఎన్నికల రాజకీయ సందడి నెలకొన్నది. రేపోమాపో ఎన్నికలు జరుగబోతున్నాయా అనేలా పరిస్థితులు ప్రతిబింబిస్తున్నాయి. సాధారణంగా ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి పార్టీలకు మద్దతు లభిస్తుంటుంది. కానీ ఎన్నికల ప్రక్రియ తెరమీదకు రాకముందే నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో బరిలో ఉండే వారి మద్దతుకోసం గ్రామంలో ముఖ్యమైన నాయకులతో మంతనాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.ఆశావహులు విస్తృత సమావేశాలు జరుపుతున్నారు. ఏకగ్రీవం కోసం నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామ పెద్దల తీర్మానాల మేరకు ఎన్నికలు జరగనున్నాయి. మరికొన్ని గ్రామాల్లో నువ్వా..? నేనా..? అనే పోటీ నెలకొంది. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులు సైతం ఈసారి కచ్చితంగా గెలిచేలా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రజలు సైతం సానుభూతి వ్యక్తం చేస్తూ గెలిపిస్తామంటూ హామీలు ఇస్తున్నారు. ఇక ప్రముఖ రాజకీయ పార్టీల నాయకులు పోటాపోటీగా అగ్రనేతలను కలిసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. నియోజకవర్గ నాయకుల మద్దతు కోసం ఆశావహులు ఎవరికివారు ప్రయత్నాలు సాగిస్తున్నారు. గత ఎన్నికల్లో పార్టీల గెలుపు కోసం విశేషంగా శ్రమించిన నాయకులు పోటీకి ఆసక్తి చూపుతున్నారు.

**సన్నాహక సమావేశాలు..**

గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల కోసం ఆశావహులు తమకు అనుకూలంగా మద్దతుగా నిలిచే వారిని ఓ చోట చేర్చి సన్నహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. గ్రామ పెద్దలు, యువకులు, యువజన సంఘాల సభ్యుల మద్దతు కూడగడుతూ తమ వైపు తిప్పుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తూ సన్నాహక సమావేశాలతో మమేకమవుతున్నారు.

**మద్దతు కోసం మందు పార్టీలు..**

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీలో నిలిచేందుకు తహతహలాడుతున్న సర్పంచ్ అభ్యర్థులు గ్రామాల్లో మందు పార్టీలు ఏర్పాటు చేస్తున్నారు. వృద్ధులు, యువకులు, యువజన, కుల సంఘాల సభ్యులను ప్రలోభ పరిచేందుకు మందు పార్టీలను ఎర వేస్తున్నారు. మద్యం ప్రియులు సైతం అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ నిత్యం ముక్క, సుక్కతో ఎంజాయ్ చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

**పెరుగుతున్న పోటీ..**

గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ రాకన్నాముందే ఆశావహులు ఇప్పటినుంచే తామంటే తాము బరిలో నిలుస్తున్నామంటూ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవికి పోటాపోటీగా ఆశావహులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఎంత ఖర్చయినా భరిస్తూ పోటీలో నిలిచి గెలుస్తామంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. గతంలో స్వల్ప మెజారిటీతో ఓడిన అభ్యర్థులు సైతం ఈసారి కచ్చితంగా గెలిచి తీరుతామని ప్రణాళికలను సైతం రూపొందించుకుంటున్నారు. అందులో భాగంగా గ్రామ ప్రజలను ప్రసన్నం చేసుకునేందుకు మాటామంతీ కలుపుతున్నారు. ఈసారైనా గెలిపించాలంటూ వేడుకుంటున్నారు. ఇప్పటినుంచే గ్రామపంచాయతీ ఎన్నికల సందడి గ్రామాల్లో నెలకొంది.

# జల్ పల్లి లో ఆసుపత్రి నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

## కెసిఆర్ హయాంలో వైద్యానికి పెద్దపీట వేశారు: సబితా ఇంద్రారెడ్డి




మహేశ్వరం ప్రతినిధి(క్రైమ్ మిర్రర్): మహేశ్వరం నియోజకవర్గంలోని జల్పల్లి మున్సిపాలిటీ పరిధిలో 30 పడకల ఆసుపత్రి నిర్మించాలని గత ప్రభుత్వ ముఖ్యమంత్రి కెసిఆర్ హయాంలో మంజూరైన నిధులతో భవన నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించిన మాజీ మంత్రివర్యులు, మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ. ఇక్కడ ఉన్న జనాభాను దృష్టిలో ఉంచుకొని సుమారుగా 75,000 వేల నుంచి 80,000 వరకు ఉన్న జనాభాలో ఒక్క ఆసుపత్రి కూడా లేదని అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే 30 పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం తేదీ. 5/10/2023 రోజున మంజూరు చేయడం జరిగిందని అన్నారు అంతేకాకుండా భవన నిర్మాణం కోసం 10 కోట్ల 70 లక్షల రూపాయలు నిధులు కూడా మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఆసుపత్రి నిర్మాణానికి ఐదు ఎకరాల భూమిని ఇవ్వవలసిందిగా వక్స్ బోర్డ్ వారికి లెటర్ రాయడం జరిగిందని, వారు కూడా సానుకూలంగా స్పందించారని తెలిపారు.కెసిఆర్ హయాంలో రంగారెడ్డి జిల్లాకు వచ్చిన మెడికల్ కాలేజ్ మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరులో ఏర్పాటు చేయడం జరిగిందని అట్టి మెడికల్ కాలేజీలో 400 పడకల ఆసుపత్రి కూడ నిర్మాణం అవుతుంది అని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు.అంతేకాకుండా నియోజకవర్గంలో 10 బస్తీ దవకానాలు, నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లు ఇప్పటివరకు ఏర్పాటు చేయడం జరిగిందని,ముఖ్యంగా కెసిఆర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ రాజకీయాలకు తావు ఇవ్వకుండా ప్రజలకు ఉపయోగపడే వాటికి ఇప్పుడున్న ప్రభుత్వం కూడా పెద్ద పీట వేయాలని,అంతేకాకుండా ఆసుపత్రి పనులు నెల రోజుల్లో ప్రారంభించాలని జల్పల్లి మున్సిపాలిటీ చైర్మన్ ఐమత్ సాది మరియు కౌన్సిలర్లు,కమిషనర్ ని సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లా ప్రత్తి రైతుల సమస్యలపై ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో

# ఆందోళన నిర్వహించిన బిఆర్ఎస్ జిల్లా శ్రేణులు



క్రైమ్ మిర్రర్ ఖమ్మం జిల్లా ప్రతినిధి :అనంతరం ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్ తో సమావేశమై రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణం చర్యలు చేపట్టవలసిందిగా డిమాండ్ చేసిన ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, MLC తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, మాజీ మార్కెట్ చైర్మన్ ఆర్.జె.సి కృష్ణ మరియు ఇతర నాయకులు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ప్రస్తుతం సీజన్ లో పత్తి రైతుల పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. పత్తి రైతులు తమ పంటను సరైన ధరకు అమ్ముకోలేకపోతున్నారు. CCI (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) అధికారులు మార్కెట్‌లో అందుబాటులో లేకపోవడం వల్ల రైతులు కనీస మద్దతు ధర (MSP) పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో పత్తి రైతుల సంక్షేమం దృష్ట్యా ఖమ్మం వ్యవసాయ మార్కెట్ నందు CCI కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి.అకాల వర్షాలు, తుఫాన్లు మరియు ఇతర వైపరీత్యాలవల్ల రాష్ట్ర వ్యాప్తంగా నష్టపోయిన పత్తి రైతులను వెంటనే ఆదుకోవాలి. నష్టపోయిన ప్రత్తి రైతులకు కేంద్ర ప్రభుత్వ మద్దతు ధరకు అదనంగా క్వింటాల్ కు 1000 రూపాయల బోనస్ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలి.జాతీయ వ్యవసాయ విధానం (E-NAM) ను అన్ని వ్యవసాయ మార్కెట్లలో తక్షణం అమలు చెయ్యాలి.రైతుల సౌకర్యార్థం గతంలో మాదిరిగా సబ్సిడీ క్యాంటీన్ ఖమ్మం వ్యవసాయ మార్కెట్ నందు పునరుద్ధరించాలి.సీసీఐ కేంద్రం నిర్వహిస్తున్న జన్నింగ్ మిల్స్ పై విచారణ చేపట్టాలి.సమస్యలపై సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే చర్యలు చేపడతానని బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల బృందానికి హామీ ఇచ్చారు.ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు %డ% ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, మాజీ మార్కెట్ చైర్మన్ ఆర్.జె.సి కృష్ణ , ముదిగొండ మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, ఉన్నం బ్రహ్మయ్య, వీరు నాయక్, బాషబోయిన వీరన్న, స్థానిక కార్పొరేటర్లు తోట వీరభద్రం, మాటేటి నాగేశ్వరరావు, పసుమర్తి రామ్మోహన్, నాయకులు డెరంగుల బ్రహ్మం, యర్రా అప్పారావు, ముత్యాల అప్పారావు, బంక మల్లయ్య, మాటేటీ కిరణ్, అడ్వకేట్ నిరోష, పగడాల నరేందర్, లింగనబోయిన్ సతీష్ మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.



# కుటుంబ సర్వే నుంచి టీచర్లను మినహాయించండి

## విద్యాహక్కుచట్టానికి వ్యతిరేకంగా ప్రభుత్వ నిర్ణయం

## సీఎం రేవంత్‌కు ఎమ్మెల్యే హరీష్ రావు లేఖ



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టబోయే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నుండి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను మినహాయించాలని బిఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు.రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సేవలను వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించడం విద్యాహక్కు చట్టం ఉల్లంఘన కిందకు వస్తుందని అన్నారు. 36,559 ఎస్జీటీలను, 3414 మంది ప్రధానోపాధ్యాయులను ఈ సర్వేలో భాగం చేస్తూ నవంబర్ 1వ తేదీన విద్యాశాఖ విడుదల చేసిన ఉత్తర్వులు నిబంధనలకు విరుద్ధం అన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకే పాఠశాలలు నిర్వహించాలనేది ఈ ఉత్తర్వుల సారాంశంగా కనిపిస్తున్నదని హరీశ్‌రావు పేర్కొన్నారు.మీ పాలన పుణ్యమా అని ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలపై ఉన్న నమ్మకం రోజురోజుకీ దిగజారుతున్నది. మీ నిర్లక్ష్యం, అనాలోచిత నిర్ణయాలు విద్యార్థులు, తల్లిదండ్రులకు తోడు ఉపాధ్యాయులకు శాపాలుగా మారుతున్నాయి. ఇప్పుడు కుటుంబ సర్వే పేరుతో టీచర్లు, విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తూ, విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం, ఉపాధ్యాయులను జనాభా గణన లెక్కలు, ప్రకృతి వైపరీత్యాలలో సహాయ విధులు, పార్లమెంటు, రాష్ట్ర శాసన సభ, స్థానిక ప్రభుత్వాలకు జరిగే ఎన్నికలకు సంబందించిన విధులకు మాత్రమే వినియోగించాలని స్పష్టం చేస్తుంది. ఇవి కాకుండా మరేఇతర పనులకు వినియోగించకూడదని విద్యా హక్కు చట్టం నిర్దేశిస్తురది. ఈ నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం కుల గణన కోసం ఉపాధ్యాయులను వినియోగించుకోవడం విద్యా హక్కు చట్ట ఉల్లంఘన కిందికి వస్తుందని హరీశ్‌రావు తెలిపారు. ప్రభుత్వ బడులలో చదివే పిల్లల తల్లిదండ్రులు అత్యధిక శాతం కూలినాలి చేసుకునే వారే. అకస్మాత్తుగా ఒంటి పూట బడులు నడపడం వలన పిల్లలకే కాకుండా తల్లిదండ్రులకు కూడా ఇబ్బందులు ఉంటాయి. పిల్లల చదువులు కుంటుపడటంతో పాటు వారి భవిష్యత్తుపై ప్రభావం పడుతుంది. కాబట్టి, విద్యా హక్కు చట్టాన్ని దృష్టిలో ఉంచుకొని సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నుండి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను మినహాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు తన లేఖలో పేర్కొన్నారు.



# సాగునీటి రంగం బలోపేతం చేసిన కెసిఆర్

## భూముల ధరలపెరుగుదలకు అదే కారణం

## రియల్టర్స్ ఫోరమ్‌లో బిఆర్ఎస్ నేత కెటిఆర్

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ఉమ్మడి ఏపీలో రైతులకు మేలు చేయాలని పాలకులు ఆలోచించ లేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ప్రత్యేక తెలంగాణలో కెసిఆర్ రైతుల బాగు గురించి ఆలోచించి సాగునీటి రంగానికి ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. దీంతో భూముల ధరలు కూడా పెరిగాయని అన్నారు. తన తాతకు 400 ఎకరాల ఆస్తి ఉండేదని.. అయితే అన్ని ఎకరాలు ఉన్నప్పటికీ నీళ్లు లేకపోవడంతో అవి నిరుపయోగంగా, విలువ లేకుండా ఉండేవన్నారు. నగరంలోని శ్రీనగర్ కాలనీలో నిర్వహించిన తెలంగాణ రియల్టర్స్ ఫోరమ్ సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఎన్నికల ముందు మార్పు కోసం అని కాంగ్రెస్ నేతలు ఊదరగొట్టారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పుడు పెట్టుబడులు రావని భయపెట్టారు. ప్రత్యేక తెలంగాణ వచ్చినప్పుడు 2 రోజులు పవర్ హాలీడే ఉండేది. 2014కు ముందు రాష్ట్రంలో భూముల ధరలు చాలా తక్కువగా ఉండేవి. భారాస అధినేత కేసీఆర్ కృషి వల్లే భూముల ధరలు పెరిగాయి. సాగునీరు లేకపోతే వ్యవసాయం చేయడం సాధ్యం కాదు. అదే జరిగితే సంపద సృష్టించడం అసాధ్యం. కేసీఆర్ పాలనలో 24 గంటల విద్యుత్, అనేక సంక్షేమ పథకాలు అమలు చేశాం. తెలంగాణలో సంపద పెరిగింది. సాగునీటి సదుపాయాలు మెరుగయ్యాయి. తొమ్మిదిన్నరేళ్ల భారాస పాలన తర్వాత తెలంగాణలో వచ్చిన మార్పులు, చేసిన అభివృద్ధి ఏంటనేది తెలంగాణ ప్రజలందరికీ తెలుసని కేటీఆర్ అన్నారు.

## ఆరు గ్యారెంటీలపై సమాధానం చెప్పండి: బండి



**రాజన్న సిరిసిల్ల, (క్రైమ్ మిర్రర్):** రాహుల్ గాంధీకి ఆరు గ్యారంటీలపై సమాధానం చెప్పే దమ్ముందా అని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టి కులగణన సంప్రదింపుల సమావేశానికి రాహుల్ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రుద్రంగిలో మీడియాతో మాట్లాడారు. ఏం సాధించాని మహారాష్ట్ర ఎన్నికల్లో తెలంగాణ కాంగ్రెస్ యాడ్స్ ఇస్తుందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత అల్లుడి కోసమే మూసీ పునరుజ్జీవం చేపడుతున్నారని విమర్శించారు. రూ.15 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టుకు లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. శంషాబాద్‌లో ఆంజనేయస్వామి ఆలయంపై దాడి అమానుషమన్నారు. తక్షణమే దుండుగలను అరెస్ట్ చేయాలన్నారు.

## సర్వేను సమగ్రంగా పూర్తి చేయాలి: కలెక్టర్

**ఆసిఫాబాద్, (క్రైమ్ మిర్రర్):** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక,కులసర్వే కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో పూర్తిచేయాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. ఈనెల 6నుంచి ప్రారంభ మయ్యే సర్వేపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్‌లు, పంచాయతీ ప్రత్యేకాధికారులు, మండల ప్రత్యేకాధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. మండల ప్రత్యేకాధికారులు సర్వేనిర్వహణపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి విజయవంతం చేయాలని తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వే పక్కాగా చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సర్వే కార్యక్రమాన్ని సకాలంలో పూర్తిచేయాలన్నారు. ఎన్యుమరేటర్లకు సర్వే బ్లాక్‌లు కేటాయించామన్నారు. తమకు కేటాయించిన ఇండ్లను సందర్శించి కుటుంబ సభ్యుల వివరాలను నిర్ణీత సమయంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని సూచించారు.



## పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

### శాంతిభద్రతల పరిరక్షణలో కటువుగా ఉండాల్సిందే

### హోంమంత్రి అనిత స్పష్టీకరణ

వైకాపా హయాంలో జరిగిన అరాచకాలను సరిదిద్దడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు హోం మంత్రి అనిత తెలిపారు. వైకాపా సైకో బ్యాచ్ అసత్యాలను ప్రచారం చేస్తూ.. ప్రజలను భయపెడుతుంటే.. జగన్ సూక్తులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. అనంతపురం పోలీస్ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన డీఎస్పీల పాసింగ్ ఔట్ పరేడ్‌కు అనిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. పోలీసుల సంక్షేమంతోపాటు వారికి మౌలిక సదుపాయాల కల్పన దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులను సమాయత్తం చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ఏమీ జరగకపోయినా.. ఏదేదో జరిగిపోయిందని దుష్ప్రచారం చేస్తూ ప్రజలను వైకాపా సైకోలు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో జగన్ ఇంటి భద్రత కోసం రూ.12 కోట్లు ఖర్చు చేశారు. వైకాపా ఐదేళ్ల పాలనలో పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులకు వైకాపా దుష్టపాలన పాపాలే కారణం. శాంతిభద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. పోలీసు వ్యవస్థను పటిష్ఠం చేస్తాం. పోలీసులకు మౌలిక సదుపాయాలను కల్పించి, సాంకేతికంగా పోలీసు వ్యవస్థను బలోపేతం చేస్తామని అనిత స్పష్టం చేశారు.

## జెత్వానీ కేసులో సుప్రీంను ఆశ్రయించిన విద్యాసాగర్

**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** ముంబై నటి కాదంబరి జెత్వానీ వ్యవహారంలో ప్రధాన నిందితుడు కుక్కల విద్యాసాగర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన అరెస్టును సమర్థిస్తూ... ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గత నెల 10న ఇచ్చిన తీర్పును సుప్రీంలో విద్యాసాగర్ సవాల్ చేశారు. విద్యాసాగర్ పిటిషన్‌పై జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ అరవింద్ కుమార్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. ట్రయల్ కోర్టులో ఇప్పటికే బెయిల్ అప్లికేషన్ దాఖలు చేసినట్లు సుప్రీంకోర్టుకు విద్యాసాగర్ తరపు న్యాయవాదులు చెప్పారు. బెయిల్ అప్లికేషన్‌పై త్వరగా నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని విద్యాసాగర్ న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. మూడు వారాల్లో బెయిల్ అప్లికేషన్‌పై నిర్ణయం తీసుకోవాలని లోయర్ కోర్టుకు ధర్మాసనం మార్గదర్శకాలు ఇచ్చింది. అలాగే ప్రతివాదులకు సుప్రీం ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

# నిత్యకృత్యంగా అత్యాచారాలు, హత్యాచారాలు

### 120 రోజుల్లో ఇలాంటి ఘటనలు 110 జరిగాయి

### రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలం

### మాజీమంత్రి రోజా విమర్శలు



**తిరుపతి,,(క్రైమ్ మిర్రర్):** రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, హత్యాచారాలు నిర్మూలించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసీపీ నేత రోజా అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గడిచిన 120 రోజుల్లో ఇలాంటి ఘటనలు 110 జరిగాయని రోజా మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలం అయ్యాయని, మహిళల మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని మాజీ మంత్రి రోజా ఆరోపించారు.మహిళలపై వరుస అఘాయిత్యాలు జరుగుతుంటే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనిత ఏం చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు జరగకుండా చూడడంలో హోంమంత్రి అనిత సరిగా పనిచేయడం లేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనడం వెనక కారణం ఏంటి?. దళితవర్గానికి చెందిన హోంమంత్రిపై నిందలు వేసి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారా?. పిఠాపురం నియోజకవర్గంలో పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న బాలికకు మత్తు మందు ఇచ్చి అత్యాచారం చేసినప్పుడు పవన్ ఎక్కడికి వెళ్లారు. చిన్నారిపై అఘాయిత్యం జరిగితే కనీసం బాధిత కుటుంబాన్ని పవన్ పరామర్శించలేదు. ఉత్తర్ ప్రదేశ్ సీఎం యోగి లాగా పనిచేయాలని ఆయన చెబుతున్నారు. యోగిలా పనిచేయమని ముఖ్యమంత్రి చంద్రబాబుకు పవన్ చెప్పాలి. అధికారం చేతిలో ఉన్న వాళ్లు తప్పులు జరగకుండా చూడాలి. కానీ సీఎం, డిప్యూటీ సీఎం, హోంమంత్రి తమ విధి నిర్వహణలో విఫలం అయ్యారు. ఇప్పుడు తిరుపతి ఘటనలోనూ నిజాన్ని కప్పిపుచ్చేందుకు బాలికను పరీక్షల పేరుతో అనేక ఆస్పత్రులకు తిప్పడం నిజం కాదా?. ప్రభుత్వం నుంచి తిరుపతి ఎస్పీకి ఎంత ఒత్తిడి వస్తుందో ఆయన మాటలు బట్టే అర్థం అవుతోందన్నారు. డీజీపీ నుంచి కిందస్థాయి సిబ్బంది వరకూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయన తనయుడు మంత్రి లోకేశ్ బదిలీలు చేసుకున్నారు. నచ్చిన వారికి పోస్టింగులు ఇచ్చుకుని ఇప్పుడు లైంగిక దాడులకు పాల్పడే నిందితులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రంలో ఇన్ని అఘాయిత్యాలు జరుగుతుంటే లోకేశ్ విదేశాల్లో తిరుగుతున్నాడు. ఆయనకి ఎవరు నచ్చలేదో వారిపై రెడ్ బుక్ రాజ్యాంగం రుద్దుతారు. గుడ్లవల్లేరులో మాన, ప్రాణాలు పోయేలా విద్యార్థినిల వీడియోలు తీస్తే వారిని బెదిరించి విషయాన్ని కప్పిపుచ్చారు. ఈ ఘటనలో విద్యాశాఖ మంత్రి పూర్తిగా విఫలం అయ్యారు. కాలేజీల్లో అమ్మాయిలపై దాడులు జరుగుతుంటే విద్యా శాఖ మంత్రి ఏం చేస్తున్నారని రోజా ప్రశ్నించారు. తిరుపతి వాసవీ నగర్‌లోనూ యువతిపై దాడి జరిగింది. రిషికొండ ఎక్కడికీ పోదు.. అక్కడే ఉంటుంది. ఇక్కడ మహిళలపై జరుగుతున్న దాడుల్ని చూడండి. మీ వల్ల కాకపోతే రాజీనామా చేయండి. ప్రధాని మోదీని వేడుకుంటున్నా. మీరూ కూటమి ప్రభుత్వంలో ఉన్నారు. ఏపీలో జరుగుతున్న దారుణాలను చూసి రాష్ట్రపతి పాలన విధించాలన్నారు. హిందూపురంలో అత్తాకోడళ్లపై గ్యాంగ్ రేప్ జరిగితే స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ సినిమా షూటింగ్స్‌లో పాల్గొన్నారు. కనీసం బాధితులను పరామర్శించలేదన్నారు. డమ్మీ హోంమంత్రిని పెడితే మహిళల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం అవుతోంది. వైసీపీ అధినేత జగన్ తిరుపతికి వస్తున్నారన్న సమాచారంతో బాధితులను బెదిరించి వారితో మాట్లాడిస్తున్నారని రోజా మండిపడ్డారు.


క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
విలేకరులు కావలెను
క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.
93934 46188

## కోహ్లి బర్త్‌డే.. తొలిసారి కుమారుడి ఫొటో షేర్ చేసిన అనుష్క

క్రికెట్ కింగ్, టీమిండియా స్టార్ విరాట్ కోహ్లి పుట్టినరోజు నేడు(నవంబరు 5). ఈ సందర్భంగా ఈ రన్‌మెషీన్‌కి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. భారత క్రికెట్ నియంత్రణ మండలి సహా యువరాజ్ సింగ్, సురేశ్ రైనా తదితరులు కోహ్లికి విషెస్ తెలిపారు. అభిమానులు సైతం తమ ఆరాధ్య క్రికెటర్‌ను విష్ చేస్తూ కోహ్లి పేరును ట్రెండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో విరాట్ ఫ్యాన్స్‌కు స్వీట్ సర్‌ప్రైజ్ ఇచ్చింది అతడి సతీమణి అనుష్క శర్మ. తమ ఇద్దరు పిల్లలు వామిక, అకాయ్‌లతో కోహ్లి ఉన్న ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇందులో కోహ్లి అకాయ్‌ను ఎత్తుకోవడంతో పాటు తన గారాలపట్టి వామికను ఒంటిచేత్తో మోస్తూ కనిపించాడు. అయితే, అనుష్క ఇక్కడో ట్విస్ట్ ఇచ్చారు. తమ చిన్నారుల ముఖాలు కనిపించకుండా లవ్ సింబల్స్‌తో కవర్ చేశారు. ఏదేమైనా తొలిసారి వామిక, అకాయ్‌లను ఈమాత్రం చూపించినందుకు 'థాంక్స్ వదినా' అంటూ కోహ్లి ఫ్యాన్స్ ఆమెకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. కాగా ఇదివరకు వామిక ఫొటోలను అడపాదడపా షేర్ చేసినా.. అకాయ్‌కు సంబంధించి మాత్రం ఇదే తొలి ఫొటో.









## అతడు క్రీజులో ఉన్నంతవరకూ మేము భయపడ్డాము: అజాజ్ పటేల్

న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌లో 3-0 తేడాతో టీమిండియా వైట్‌వాష్ అయినప్పటికి స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ తన అద్భుత ఇన్నింగ్స్‌లతో అందరని ఆకట్టుకున్నాడు. ముఖ్యంగా ముంబై వేదికగా జరిగిన ఆఖరి టెస్టులో రిషబ్ వీరోచిత పోరాటం కనబరిచాడు. బంతి గింగరాల తిరుగుతున్న చోట కివీస్ స్పిన్నర్లను పంత్ సమర్ధవంతంగా ఎదుర్కొన్నాడు. విరాట్ కోహ్లి, గిల్, జైశ్వాల్ వంటి స్టార్ ప్లేయర్లు విఫలమైన చోట పంత్ బౌండరీల వర్షం కురిపించాడు. ఓ దశలో భారత్‌ను గెలిపించేలా కన్పించిన పంత్.. ఓ వివాదస్పద నిర్ణయంతో పెవిలియన్‌కు చేరాల్సి వచ్చింది. దీంతో 25 పరుగుల తేడాతో టీమిండియా ఓటమి చవిచూసింది. అయితే మ్యాచ్ ముగిసి రెండు రోజులు అవుతున్నప్పటికి పంత్‌పై ప్రశంసల వర్షం కురుస్తునే ఉంది. అతడి సాహసోపేత ఇన్నింగ్స్‌కు న్యూజిలాండ్ ఆటగాళ్లు సైతం ఫిదా అయిపోయారు. పంత్ క్రీజులో ఉన్నప్పుడు ప్రత్యర్ధి జట్టు ఆటగాళ్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయంట. ఈ విషయాన్ని స్వయంగా ముంబై టెస్టు హీరో అజాజ్ పటేల్ చెప్పుకొచ్చాడు. అజాజ్ పటేల్ తాజాగా ఎన్డీటీవీకి ఇంటర్వ్యూ ఇచ్చాడు. ఈ క్రమంలో రిషబ్ పంత్ హాఫ్ సెంచరీ సాధించినప్పుడు న్యూజిలాండ్ జట్టు భయపడిందా అన్న ప్రశ్న అజాజ్‌కు ఎదురైంది. అవును రిషబ్ క్రీజులో ఉన్నప్పుడు మేముంతా చాలా భయపడ్డాము అని అజాజ్ పటేల్ బదులిచ్చాడు. ఈ సిరీస్‌లో రిషబ్ పంత్‌ను ఎక్కువగా టార్గెట్ చేశాం. అతడు క్రీజులో ఉన్నప్పుడు ఏ బౌలర్‌కు భయపడడు. ఏది ఏమైనా తన ఆట ఆడుతుంటాడు. క్రీజులో ఉన్నంతసేపు పరుగులు రాబట్టడానికే ప్రయత్నిస్తాడు. అతడు త్వరగా ఔట్ అయితే ఏ సమస్య లేదని అజాజ్ పటేల్ అదే ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు.

## షమీ రాక ఆలస్యం



బెంగళూరు: భారత సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ పూర్తి స్థాయి క్రికెట్ ఆడేందుకు మరింత సమయం పట్టే అవకాశముంది. కీలకమైన ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌కు ముందు దేశవాళీ రంజీ టోర్నీ ద్వారా సన్నద్ధం కావాలనుకున్న షమీ ఆశలు నెరవేరేలా కనిపించడం లేదు. బుధవారం నుంచి చిన్నస్వామి స్టేడియం వేదికగా కర్ణాటకతో జరిగే మ్యాచ్‌తో పాటు మధ్యప్రదేశ్ పోరుకు ఎంపిక చేసిన బెంగాల్ జట్టులో షమీకి చోటు దక్కలేదు. న్యూజిలాండ్‌తో తొలి టెస్టు సందర్భంగా నెట్స్‌లో ప్రాక్టీస్ చేసిన షమీ తాను 100 శాతం ఫిట్‌నెస్‌తో ఉన్నానని ప్రకటించిన సంగతి తెలిసిందే.

# భారత టెస్టు క్రికెట్ చరిత్రలోనే ఘోరమైన ఓటమిని మూటగట్టుకున్న రోహిత్ సేనపై విమర్శల పర్వం

**కివీస్ చేతిలో టీమిండియా వైట్‌వాష్.. ఆసీస్ స్టార్ కామెంట్స్ వైరల్**



**భారత టెస్టు క్రికెట్ చరిత్రలోనే ఘోరమైన ఓటమిని మూటగట్టుకున్న రోహిత్ సేనపై విమర్శల పర్వం కొనసాగుతోంది. క్రికెట్ దిగ్గజాలు సునిల్ గావస్కర్, సచిన్ టెండుల్కర్, అనిల్ కుంబ్లే తదితరులు న్యూజిలాండ్ చేతిలో ఓటమిని తట్టుకోలేక.. టీమిండియా వైఫల్యాన్ని ఎత్తిచూపుతూ ఘాటుగా స్పందిస్తున్నారు. అయితే, ఆస్ట్రేలియా స్టార్ జోష్ హాజిల్‌వుడ్ మాత్రం ఇందుకు భిన్నంగా స్పందించాడు.**

### తొలిసారి -0-3తో వైట్‌వాష్

కాగా ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) 2023-25 ఫైనల్ చేరాలంటే తప్పక గెలవాల్సిన సిరీస్‌లో భారత జట్టు దారుణంగా విఫలమైన విషయం తెలిసిందే. స్వదేశంలో కివీస్‌తో జరిగిన మూడు టెస్టుల్లో ఓడి.. వైట్‌వాష్‌కు గురైంది. తద్వారా భారత క్రికెట్ చరిత్రలో ఈ చెత్త ఘనత సాధించిన తొలి జట్టుగా రోహిత్ సేన నిలిచింది. ఫలితంగా ఘోర అవమానం మూటగట్టుకోవడంతో పాటు.. డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలనూ సంక్లిష్టం చేసుకుంది. తదుపరి ఆస్ట్రేలియా పర్యటనలో నాలుగు టెస్టులు కచ్చితంగా గెలవాల్సిన స్థితికి చేరింది. ఈ నేపథ్యంలో గావస్కర్ వంటి విశ్లేషకులు ఇక మనం డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలు వదిలేసుకోవడం మంచిదనే అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

### నిద్రపోయిన దిగ్గజానికి ఇదో మేలుకొలుపు

ఈ నేపథ్యంలో ఆసీస్ పేసర్ హాజిల్‌వుడ్ స్పందించిన తీరు మాత్రం వైరల్‌గా మారింది. "నిద్రపోయిన దిగ్గజానికి ఇదో మేలుకొలుపు. అయితే, వారు దీని నుంచి ఎలా బయటపడతారో చూద్దాం" అని హాజిల్‌వుడ్ వ్యాఖ్యానించాడు. ఇక టీమిండియా 3-0తో గెలవడం కంటే.. 0-3తో ఓడిపోవడమే వారికి మంచిదని అతడు అభిప్రాయపడ్డాడు. కివీస్‌తో సిరీస్‌లో చాలా మంది బ్యాటర్లు విఫలమయ్యారని.. అయితే ఒకరిద్దరు మాత్రం అద్భుతంగా ఆడారని కొనియాడాడు. అయితే, ప్రస్తుతం టీమిండియాతో పోటీ ఎలా ఉండబోతుందో అంచనా వేయలేమని.. ఏదేమైనా ఫలితాలు మాత్రం తమకు అనుకూలంగా వస్తాయని హాజిల్‌వుడ్ ధీమా వ్యక్తం చేశాడు.

### టీమిండియా మరింత స్ట్రాంగ్‌గా

ఇక ఇండియాలో ఒక్క టెస్టు గెలవడమే కష్టమని.. అలాంటిది క్లీన్‌స్వీప్‌తో కివీస్ ఆటగాళ్లు అసాధ్యాన్ని సుసాధ్యం చేశారని హాజిల్‌వుడ్ కొనియాడాడు. అయితే, భారత జట్టును తక్కువ అంచనా వేయబోమని.. న్యూజిలాండ్ చేతిలో ఓటమి తర్వాత టీమిండియా మరింత స్ట్రాంగ్‌గా తిరిగివస్తుందని పేర్కొన్నాడు. కాగా నవంబరులో రోహిత్ సేన ఆస్ట్రేలియాకు వెళ్లనుంది. బోర్డర్- గావస్కర్ ట్రోఫీలో భాగంగా కంగారూ జట్టుతో ఐదు టెస్టులు ఆడనుంది. ఇందులో నాలుగు గెలిస్తేనే టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలు సజీవంగా ఉంటాయి.

# ఏడాదికో మెగా టోర్నీ

**ఐసీసీ ఉమెన్స్ ఎఫ్‌టీపీ 2025-29 షెడ్యూల్ విడుదల**

**మహిళా క్రికెట్‌లోనూ చాంపియన్స్ ట్రోఫీ**



దుబాయ్: పురుషులతో సమానంగా మహిళల క్రికెట్‌ను ప్రోత్సహిస్తున్న అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మరో కీలక ముందడుగు వేసింది. ఇక నుంచి ప్రతి ఏడాదీ మహిళా క్రికెట్‌లోనూ ఓ భారీ టోర్నీ ఉండేలా ప్రణాళికలు రచించింది. ఈ మేరకు ఐసీసీ సోమవారం ఉమెన్స్ ఫ్యూచర్ టూర్ ప్రోగ్రామ్ (ఎఫ్‌టీపీ) 2025-2029 షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఇందులో భాగంగా రాబోయే ఐదేండ్లలో రెండు వన్డే ప్రపంచకప్పులు (2025, 2029), రెండు టీ20 ప్రపంచకప్పు (2026, 2028)లతో పాటు 2027లో చాంపియన్స్ ట్రోఫీని నిర్వహించేందుకు రంగం సిద్ధం చేసింది. 2027 జూన్-జూలైలో ఆరు జట్లతో తొలిసారి జరుగబోయే చాంపియన్స్ ట్రోఫీ (టీ20 ఫార్మాట్‌లో)కి శ్రీలంక ఆతిథ్యమివ్వనుంది. లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్ (2028లో) షెడ్యూల్ కూడా ఈ సైకిల్‌లో భాగం కానుంది. కొత్త సైకిల్‌లో మూడు ఫార్మాట్లలోనూ కలిసి 400 మ్యాచ్‌లు జరుగనున్నాయి.

## కుస్తీకి సిద్ధమవుతున్న ఎమ్మెల్యే.. ఒలింపిక్ పతకం కోసమేనా..?

పారిస్ ఒలింపిక్స్‌లో పతకం చేజారిన బాధలో రెజ్లింగ్ వదిలేసిన వినేశ్ ఫొగాట్ ఎట్టకేలకు యూ టర్న్ తీసుకోనుంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికైన వినేశ్ మళ్లీ తనకెంతో ఇష్టమైన ఆటలో మెరువనుంది. మల్ల యోధురాలైన ఆమె ఒలింపిక్ పతకం కలను నిజం చేసుకోవడంపై దృష్టి పెట్టనుంది. అవును మీరు చదువుతున్నది నిజమే. రిటైర్మెంట్ నిర్ణయం వెనక్కి తీసుకోవడంపై వినేశ్ తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఆసక్తికరమైన నాలుగు వాఖ్యాలున్న హిందీ పద్యాన్ని పోస్ట్ చేసింది.



GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

# ధనికుల వద్దకు తిరుపతి లడ్డూలు..!
## టీటీడీపై విమర్శలు



**చెన్నై, (క్రైమ్ మిర్రర్):** ఖరీదైన భక్తుల చెంతకు చేర్చేందుకు కొంతమంది టీటీడీ సిబ్బంది ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టీటీడీ ఆధ్వర్యంలో టి.నగర్ వెంకటనారాయణరోడ్డులో వెంకటేశ్వరస్వామి ఆలయం ఉన్న విషయం తెలిసిందే. తిరుమల తరహాలోనే ఇక్కడా ఆలయ ప్రాంగణంలోనే లడ్డూలను విక్రయిస్తుంటారు. అయితే గత కొంతకాలంగా వారానికి రెండుసార్లు తిరుమల నుంచి లడ్డూలు వస్తుండడంతో భక్తులకు విరివిగా లభ్యమవుతున్నాయి. కొన్నిసార్లు అవసరానికి మించి లడ్డూలు వస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కొంతమంది ఆలయ సిబ్బంది లడ్డూలను ధనికులైన భక్తుల నివాసాలకు తీసుకెళ్లి ఇస్తున్నట్లు సమాచారం. స్వామివారి ప్రసాదాన్ని అందించి, వారి నుంచి తమకు 'కావాల్సిన'వి పొందుతున్నట్లు తెలిసింది. ఇటీవలి కాలంలో ఈ 'ప్రసాద వితరణ' మరీ ఎక్కువైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిని అరికట్టాలని పలువురు భక్తులు కోరుతున్నారు. దీనిపై ఇప్పటికే టీటీడీ విజిలెన్స్ కు ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. రెండు వారాల క్రితం ఇక్కడకు తనిఖీకి వచ్చిన విజిలెన్స్ అధికారులకు సైతం ఫిర్యాదులందాయి. దీనిపై విజిలెన్స్ అధికారులు సైతం ఆరా తీసినట్లు తెలిసింది. ఈ ఆరోపణలు నిజమని తేలడంతో విజిలెన్స్ అధికారులు నివేదికను రూపొందించినట్లు సమాచారం. దీనిపై త్వరలోనే చర్యలుంటాయని టీటీడీ వర్గాలు తెలిపాయి. కాగా ఇద్దరు ఉద్యోగులు సుదీర్ఘకాలంగా చెన్నై ఆలయంలోనే పని చేయడం పట్ల కూడా విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులందినట్లు తెలిసింది.

# బిష్ణోయ్ ఫొటోలతు టీషర్టులు
## ఇ-కామర్స్‌పై నెటిజన్ల ఫైర్




**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** బాలీవుడ్ స్టార్ నటుడు సల్మాన్ ఖాన్‌కు వరుస హత్య బెదిరింపులు, బాబా సిద్ధిఖీ హత్య కేసు, జైల్లో ఉంటూనే టార్గెట్లను పూర్తి చేస్తుండటం వంటి కారణాలతో బిష్ణోయ్ పేరు దేశ వ్యాప్తంగా మార్మోగిపోతోంది. ఈ నేపథ్యంలో మీషో, ఫ్లిప్‌కార్ట్, టీషాపర్ వంటి ప్రముఖ ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు గ్యాంగ్‌స్టర్ చిత్రాలతో కొన్ని టీషర్టులను విక్రయించడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఆయా ప్లాట్ ఫామ్‌లు లారెన్స్ బిష్ణోయ్ చిత్రాలతో కూడిన టీషర్ట్‌లను ఆన్‌లైన్ ద్వారా విక్రయిస్తున్నాయి. ఆ టీషర్ట్స్‌పై బిష్ణోయ్‌ను 'గ్యాంగ్‌స్టర్', 'హీరో' అంటూ పేర్కొనడం ప్రధానంగా చర్చకు దారితీస్తోంది. మీషో సంస్థ ఈ టీషర్ట్స్ ధరను రూ.166 నుంచి రూ.177 తో విక్రయిస్తోంది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకూ అన్ని సైజుల్లోనూ ఈ టీషర్ట్‌లను తమ సైట్‌లో అందుబాటులో ఉంచింది. వీటిని చూసిన అలీషాన్ జాఫ్రీ అనే జర్నలిస్టు ఆ ఫొటోలను ఎక్స్ వేదికగా పోస్టు చేయడంతో.. ఈ అంశం వెలుగులోకి వచ్చింది. దీనిపై నెటిజన్ల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సదరు ప్లాట్‌ఫామ్స్‌పై నెటిజన్లు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో మీషో దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. ఆయా ఉత్పత్తులను వెబ్‌సైట్ నుంచి తొలగించేందుకు తక్షణమే చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. 'ఉత్పత్తులను వెబ్‌సైట్ నుంచి తొలగించేందుకు తక్షణమే చర్యలు తీసుకున్నాం. మా వినియోగదారులందరికీ సురక్షితమైన,విశ్వసనీయమైన షాపింగ్ ప్లాట్‌ఫామ్‌ను అందించేందుకు మీషో కట్టుబడి ఉంది' అంటూ మీషో ప్రతినిధి ఒకరు తెలిపారు.


# వైసీపీ నేతకు హైకోర్టు షాక్




**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** ఆంధ్రజ్యోతి విలేఖరి హత్య కేసులో వైసీపీ నేతకు హైకోర్టు షాకిచ్చింది. ఈ హత్య కేసులో వైసీపీ తుని మాజీ ఎమ్మెల్యే దాడిశెట్టి రాజా ముందస్తు బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు. మంగళవారం బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణకు వచ్చింది. అయితే వైసీపీ మాజీ ఎమ్మెల్యే ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ హైకోర్టు ధర్మాసనం నిర్ణయం తీసుకుంది. కాగా... 2020లో ఆంధ్రజ్యోతి తుని రూరల్ విలేఖరి కె. సత్యనారాయణ హత్య రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ హత్యలో మాజీ ఎమ్మెల్యే దాడిసెట్టి రాజా ప్రమేయం ఉందని అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే ఈ కేసులో మాజీ ఎమ్మెల్యేపై కేసు లేకుండా చేశారు పోలీసులు. దీనిపై న్యాయవాది అయిన సత్యనారాయణ సోదరుడు.. ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే రాజా ప్రమేయం ఉందని కోర్ట్‌లో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో మాజీ ఎమ్మెల్యేపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని హైకోర్ట్‌లో రాజా పిటిషన్ వేశారు. కె. సత్యనారాయణ... తుని నియోజకవర్గం తొండంగి మండలంలో ఆంధ్రజ్యోతి విలేఖరిగా పనిచేశారు. ఈ క్రమంలో 2020లో సత్యనారాయణను కొందరు వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. విధులు ముగించుకుని రాత్రి సమయంలో ఎస్. అన్నవరంలోని ఇంటికి బైక్‌పై వెళ్తుండగా.. లక్ష్మీదేవి చెరువుగట్టుపై కొందరు వ్యక్తులు అడ్డగించి దాడి చేశారు. తమతో తెచ్చిన కత్తులతో సత్యనారాయణపై విచక్షణారహితంగా దాడి చేశారు.

# ఆ లేఖ రాసింది ఎవరూ?
## వైసీపీ నాయకుల పనే : టీడీపీ ఆరోపణలు
### విజయమ్మ సంతకం ఫోర్జరీ చేసి పోస్టు చేశారని టీడీపీ అనుమానాలు

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** కారు ప్రమాదంపై వివరణ ఇస్తూ వైఎస్ విజయమ్మ రాసినట్లుగా ఒక లేఖను ఇటీవల వైసీపీ తన అధికారిక ట్విట్టర్ ఖాతాలో పోస్టు చేసింది. రాజకీయ లబ్ధి కోసం తన కుమారుడు జగన్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని ఆ లేఖలో ఉంది. అయితే ఆ లేఖ రాసింది విజయమ్మ కాదని.. ఆమె సంతకాన్ని ఫోర్జరీ చేశారని టీడీపీ ఆరోపించింది. కొద్దిరోజుల క్రితం షర్మిల రిలీజ్ చేసిన లేఖలో విజయమ్మ సంతకానికి.. వైసీపీ విడుదల చేసిన లేఖలో ఉన్న సంతకానికి పొంతన కుదరలేదు. దీంతో టీడీపీ పలు అనుమానాలను లేవనెత్తింది. తన సంతకాన్ని ఫోర్జరీ చేశారని విజయమ్మ చెప్పడంతో వైసీపీ ఇటీవల పోస్టు చేసిన లేఖను కూడా డిలీట్ చేసిందని టీడీపీ తెలిపింది. ఈ ఫోర్జరీ లేఖపై ఆగ్రహం వ్యక్తం చేసింది. సైకో జగన్ తన నీచనికృష్ట బుద్ధితో ఏకంగా తల్లి సంతకాన్నే ఫోర్జరీ చేశారని టీడీపీ విమర్శించింది. ఏకంగా తల్లి సంతకం ఫోర్జరీ చేసిన సైకో నీ బతుకు మొత్తం ఇలాంటి కల్తీ పనులేనా అని మండిపడింది. ఇలాంటి సంతకాలు ఫోర్జరీ చేసి, చెల్లి ఆస్తులు కొట్టేశావా అని జగన్‌ను నిలదీసింది. ఇలాంటి సంతకాలు ఫోర్జరీ చేసి, బాబాయ్‌ను వేసేసి లెటర్ రాయించావా? అని ప్రశ్నించింది. ఇలా సంతకాలు ఫోర్జరీ చేసే, తల్లిపై ఎన్‌సీఎల్‌టీలో కేసులు వేశావా? అని ప్రశ్నించింది. విజయమ్మ రాసిందని పేర్కొంటూ వైసీపీ పోస్టు చేసిన లేఖలో ఏమున్నదంటే.. గత రెండు రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారం నన్ను తీవ్రంగా కలచి వేస్తోంది. కొంతమంది సోషల్ మీడియాలో లేనిపోని అసత్య కథనాలు ప్రచారం చేయడం చూస్తుంటే నాకు తీవ్ర మానసిక వేదన కలుగుతోంది. నన్ను అడ్డం పెట్టుకుని చేస్తున్న నీచ నికృష్ట రాజకీయాలకు ఖండించకపోతే ప్రజలు నిజం అని నమ్మే ప్రమాదం ఉంది. వాస్తవాలను, కొంత మంది దుర్మార్గపు ఉద్దేశాలను రాష్ట్ర ప్రజలకు తెలియజేయాలనే నేను ఈ వివరణ రాస్తున్నాను. రెండు రోజుల కిందట నా కారుకు ప్రమాదం జరిగిందని సోషల్ మీడియాలో ప్రచారం మొదలుపెట్టారు. గతంలో ఎప్పుడో జరిగిన నా కారు ప్రమాదాన్ని నా కుమారుడి పై పెట్టి దుష్ప్రచారం చెయ్యడం అత్యంత జుగుప్సాకరం. రాజకీయంగా లబ్ధి పొందాలనే ఈ ప్రయత్నం అత్యంత దుర్మార్గం.



అమెరికాలో ఉన్న నా మనవడి దగ్గరకు వెళితే దాన్ని కూడా తప్పుగా చిత్రికరించి భయపడి నేను విదేశాలకు వెళ్ళిపోయినట్లు దుష్ప్రచారం చెయ్యడం అత్యంత నీతిమాలిన చర్య. రాజకీయ ప్రయోజనాల కోసం ఇంతగా దిగజారి ప్రవర్తించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ఇలా దుష్ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించాలనే విధానం ఏమాత్రం సమర్ధనీయం కాదు. ఈ నీచ సంస్కృతిని ఎటువంటి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. ఇకముందు ఇటువంటి దుష్ప్రచారాలను, వ్యక్తిత్వహనన వైఖరిని ఆపితే మంచిది. ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూడా ఈ వికృత చేష్టలను గమనిస్తూనే ఉన్నారు. సరైన సమయంలో సరైన విధంగా బుద్ధి చెబుతారు. ఇక పై ఇటువంటి లేనిపోని అసత్యాలను ప్రచారం చేస్తే నేను చూస్తూ ఊరుకోదలచుకోలేదు.



# కుప్పంలో వైసీపీకి బిగ్ షాక్
## మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ వైసీపీకి రాజీనామా

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** ఏపీ సీఎం చంద్రబాబు నియోజకవర్గమైన కుప్పంలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ వైసీపీకి రాజీనామా చేశారు. పార్టీతో పాటు మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ పదవులకు రాజీనామా చేశారు. చైర్మన్ పదవికి రాజీనామా చేసిన లేఖను కుప్పం మున్సిపల్ కమిషనర్‌కు పంపించారు. అనంతరం అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమక్షంలో పచ్చ కండువా కప్పుకున్నారు.

# విద్యుత్ ఛార్జీల భారం మోపితే ఊరుకోం

**విజయవాడ,(క్రైమ్ మిర్రర్):** విద్యుత్ ఛార్జీలపై ప్రజలను మోసం చేస్తూ వారిపై భారం మోపితే ఊరుకునేది లేదని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల విమర్శలు చేశారు. ఎవరి పాపమో అన్నది పక్కనపెట్టి ప్రస్తుత ప్రభుత్వం ప్రజలపై భారం పడకుండా చూడాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన పాపాల గురించి ప్రస్తావించడం కాదని, ఆ పాపాలకు ప్రాయశ్చిత్తం చేయాల్సింది పోయి, ఆ పాపపు పరిహారాన్ని ప్రజల నెత్తిన మోపేందుకు కూటమి సర్కార్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రూ.18వేల కోట్ల సర్దుబాటు ఛార్జీల వసూళ్ళ విషయంలో మా తప్పేం లేదని, మాకసలు సంబంధమే లేదని, భారం మాది కాదని, ప్రజల మీదే ఆ మొత్తాన్ని మోపుతున్నారని విరుచుకుపడ్డారు. విద్యుత్ ఛార్జీల గురించి కూటమి ప్రభుత్వ తీరును వైఎస్ షర్మిల తప్పు పట్టారు. విద్యుత్ ఛార్జీలపై సర్కార్‌ది సర్దుబాటు కాదు ఇది, ప్రజలకు 'సర్దుపోటు'. కూటమి సర్కారు ప్రజలకు ఇచ్చిన భారీ కరెంటు షాక్. విద్యుత్ ఛార్జీల విషయంలో వైసీపీ చేసింది పాపం అయితే రాష్ట్ర ప్రజలకు కూటమి సర్కార్ పెడుతుంది శాపం. గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో ప్రజలకు ఏం సంబంధమని అన్నారు. ఎక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు చేస్తే పడే అదనపు భారం ప్రజల నెత్తిన మోపుతారా అని ప్రశ్నించారు. ఐదేళ్లలో వైసీపీ భారం రూ.35 వేల కోట్లు అయితే 5 నెలల్లో కూటమి భారం రూ.18 వేల కోట్లా అని ప్రశ్నించారు. వైసీపీకి మీకు ఏంటి తేడా అన్నారు. వైసీపీ 9 సార్లు ఛార్జీలు పెంచిందని, కూటమి అధికారంలో కొస్తే ఒక్క రూపాయి కూడా ఛార్జీలు పెంచమని, అవసరం అయితే 30 శాతం తగ్గించేలా చూస్తాం అని ఎన్నికల్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలపై కట్టుబడి ఉంటే, తప్పు ఎవరు చేసినా ఆ భారాన్ని ప్రజలపై మోపొద్దనే చిత్తశుద్ధి మీకుంటే.. వెంటనే రూ.18 వేల కోట్ల సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయండని' వైఎస్ షర్మిల ఏపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై పడుతున్న భారంపై నిధులు ఇవ్వాలని ప్రధాని మోదీని గల్లా పట్టి అడగండి.

# నకల్సిజం, ఫ్యాక్షనిజాన్ని నిర్మూలించిన ఏపీ పోలీసులు

**డీఎస్పీల ట్రైనింగ్‌లో మహిళలు ప్రతిభ భేష్**

**హోంమంత్రి వంగలపూడి అనిత**



**అనంతపురం, (క్రైమ్ మిర్రర్):** నకల్సిజం, ఫ్యాక్షనిజాన్ని నిర్మూలించిన వారు ఏపీ పోలీసులు అని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం అనంతపురం పీటీసీలో డీఎస్పీల పాసింగ్ ఔట్ పరేడ్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హోంమంత్రి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. డీఎస్పీల ట్రైనింగ్‌లో మహిళలు ప్రతిభ కనబరచడం చాలా గర్వంగా ఉందన్నారు. "మహిళలు, చిన్న పిల్లలపై అఘాయిత్యాల విషయంలో మనం కార్నర్ అవుతున్నాము.. అనేక నేరాలు చేసే వారు మనకు సవాళ్లు విసురుతున్నారు. దీనిపై ఎవరు భయపడినా.. పోలీసు వ్యవస్థ మాత్రం భయపడకూడదు" అని చెప్పుకొచ్చారు. గత ఐదేళ్లలో పోలీస్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని విమర్శించారు. పోలీసు శాఖకు ఇచ్చిన నిధులు కూడా ఖర్చు చేయలేకపోయారన్నారు. లా అండర్ ఆర్డర్‌తో పాటు పోలీస్ వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. రాజకీయ ముసుగులో ఉన్మాదులు తప్పించుకుంటున్నారని.. వారి కంట్రోల్ చేయాలన్నారు. సోషియల్ మీడియాలో జరుగుతున్న దాడులు కూడా కంట్రోల్ చేయాలని హోంమంత్రి అనిత వెల్లడించారు. డీజీపీ కీలక సూచనలు కాగా.. అనంతపురం పీటీసీలో 2023 బ్యాచ్ కు చెందిన 12మంది డీఎస్పీలతో పాసింగ్ ఔట్ పరేడ్ నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో 7మంది మహిళా డీఎస్పీలు ఉన్నారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మెడల్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీజీపీ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ.. గతానికి ఇప్పటికీ నేరాల్లో చాలా మార్పులు వచ్చాయన్నారు. వాటికి అనుగుణంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా నూతన డీఎస్పీలకు డీజీపీ కీలక సూచనలు చేశారు. "మీరు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి.. బాధ్యతగా ఉండాలి. చివరి వరకు నిజాయతీగా, పారదర్శకతతో పని చేయాలి. మీరు ఇప్పుడు ఎలా ఉన్నారో.. చివరి వరకు అలాగే ఉండాలి. మీరు ఇప్పుడు ఎంత ఫిట్ నెస్, జోష్‌తో ఉన్నారో లాస్ట్ డే వరకు సర్వీస్‌లో ఉండాలి" అంటూ డీజీపీ తెలిపారు.

# రోడ్లను హేమమాలినీ బుగ్గల్లా నున్నగా చేస్తా..!

**హేమ మాలినీపై ఎమ్మెల్యే నరేష్ బల్యాన్ వివాదాస్పద వ్యాఖ్యలు**

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** డ్రీమ్ గర్ల్, ఎంపీ హేమ మాలినీపై ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఎమ్మెల్యే నరేష్ బల్యాన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఉత్తమ్ నగర్ రోడ్లను హేమ మాలినీ బుగ్గల్లా నున్నగా చేస్తానంటూ వ్యాఖ్యానించారు. 'ఉత్తమ్ నగర్ రోడ్లను హేమ మాలినీ బుగ్గల్లా సన్నగా చేస్తాను' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం దుమారం రేపుతున్నాయి. ఆప్ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారు. ఢిల్లీ బీజేపీ అధికార ప్రతినిధి ప్రవీణ్ శంకర్ కపూర్ ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఆయన వ్యాఖ్యలు మహిళలను అగౌరవపరిచేలా, స్థానిక సమాజాన్ని అవమానించేలా ఉన్నాయన్నారు. ఓ మహిళను అగౌరవపరిచేలా మాట్లాడిన ఎమ్మెల్యేపై తగిన చర్యలు తీసుకోవాలంటూ ఆప్ సుప్రిమో అరవింద్ కేజ్రీవాల్‌ను డిమాండ్ చేశారు. మరోవైపు ఆప్ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై పలువురు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కాగా, రాజకీయ నేతలు హేమ మాలినీపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఇదేమీ తొలిసారి కాదు. గతంలో మహారాష్ట్ర మంత్రి ఒకరు ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. జల్గావ్ జిల్లాలోని తన నియోజకవర్గంలో రోడ్లను ప్రముఖ నటి హేమ మాలినీ బుగ్గలతో పోల్చారు. ఆ రోడ్లను ఎంత బాగా అభివృద్ధి చేశానో విపక్ష నేతలు వచ్చి చూడాలని సవాల్ విసిరారు. అవి హేమ మాలినీ బుగ్గల్లా నున్నగా ఉన్నాయంటూ వ్యాఖ్యానించారు.

# వికీపీడియాకు కేంద్రం నోటీసులు జారీ

**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** ప్రముఖ వ్యక్తులు.. చారిత్రక కట్టడాలు.. ప్రముఖ ప్రదేశాలు.. ఇలా ఏ సమాచారం కావాలన్నా ముందుగా గుర్తొచ్చేది వికీపీడియా. ఈ ఎన్‌సైక్లోపీడియా మనకు చితంగా సమాచారన్ని అందిస్తోన్న విషయం తెలిసిందే. అయితే, ఈ వికీపీడియాకు కేంద్రం నోటీసులు జారీ చేసింది. ఇందులో కచ్చితత్వం లేని సమాచారం ఉంటోందన్న ఫిర్యాదుల మేరకు నోటీసులు పంపింది. వికీపీడియాలో పక్షపాతంగా సమాచారం ఉంటోందని పలువురు నుంచి ఫిర్యాదులు అందినట్లు కేంద్రం నోటీసుల్లో తెలిపింది. చిన్న సంపాదకులకు, సంస్థలకు కూడా కంటెంట్‌పై ఎడిటోరియల్ నియంత్రణ ఉంటుందని.. వికీపీడియాకు ఆ వ్యవస్థ ఎందుకు లేదని ప్రశ్నించింది. వికీపీడియాను మధ్యవర్తిగా కాకుండా.. పబ్లిషనర్‌గా ఎందుకు పరిగణించకూడదని ప్రశ్నించింది.



# దుల్కర్‌కు జోడీగా...

దుల్కర్ సల్మాన్, సాయి పల్లవి జోడీగా నటించనున్నారా? అంటే అవుననే సమాధానమే ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. దుల్కర్ సల్మాన్ హీరోగా పవన్ సాధినేని దర్శకత్వంలో 'ఆకాశంలో ఒక తార' అనే సినిమా తెరకెక్కనుంది. దుల్కర్ పుట్టినరోజు (జూలై 28) సందర్భంగా ఈ సినిమాను ఈ ఏడాది జూలైలో అధికారికంగా ప్రకటించారు. కానీ దుల్కర్ ఇతర ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉండటం వల్ల ఈ సినిమా ఇంకా సెట్స్ పైకి వెళ్లలేదు. ఈ ఏడాది చివర్లో సెట్స్‌పైకి తీసుకుని వెళ్లాలనుకుంటున్నారట. ఇక ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు సాయి పల్లవిని తీసుకోవాలని చిత్రయూనిట్ భావిస్తోందని, ఈ కథ సాయి పల్లవికి వినిపించగా, ఆమె కూడా సినిమా చేయడానికి ఒప్పుకున్నారని టాక్. మరి... దుల్కర్-సాయి పల్లవి జోడీ కుదురుతుందా? అంటే వేచి చూడాల్సిందే. స్వప్నా సినిమాస్, వైజయంతీ మూవీస్, లైట్‌బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్, గీతా ఆర్ట్స్ పతాకాలపై సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం ఈ సినిమాను నిర్మించనున్నారు.



# ప్రతి ఒక్కడూ సమీక్షకుడే

సినిమా సమీక్షకులపై నిరసనలు పెరుగుతున్నాయి. ఇటీవలే టాలీవుడ్ నటుడు శ్రీకాంత్ అయ్యంగార్ రివ్యూయర్లపై నోరు పారేసుకోగా.. తాజాగా బాలీవుడ్ కథా రచయిత్రి కనిక ధిల్లాన్ కూడా మండిపడ్డారు. తన తాజా చిత్రం 'దో పట్టి'పై కొందరు ప్రతికూల సమీక్షలు రాశారు. హిందీ చిత్రసీమలో విభిన్నమైన కథలను అందిస్తున్న రచయిత్రిగా పేరున్న కనిక.. ఈ నెగెటివ్ రివ్యూలపై స్పందించారు. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో అదే విషయమై మాట్లాడారు. "ప్రేక్షకులకు మంచి సినిమా అందించడానికి ఏమేం చేయాలో.. అన్నీ చేస్తాం. వారు ఆ సినిమాను చూసి.. అందులోని సందేశాన్ని గ్రహిస్తే చాలని కోరుకుంటాం. అసలు మేం సినిమాలు చేసేదే ప్రేక్షకుల కోసం. మధ్యలో ఈ సమీక్షకులు ఎవరు? మేం వారి కోసం సినిమా చేయడం లేదు. నిజానికి సగటు ప్రేక్షకులు ఓపెన్ మైండెడ్‌గానే ఉంటున్నారు. ఈ సమీక్షలు చేసేవాళ్లే మరీ లోతుగా వెళు తున్నారు. ఈకాలంలో సోషల్ మీడియాను వాడుతున్న ప్రతి ఒక్కరూ సినిమా సమీక్షకులు అయిపోతున్నారు. వారి సొంత అభిప్రాయాలను సినిమాలపై రుద్దేస్తున్నారు. నిష్పక్షపాతంగా సమీక్ష రాసేవాళ్లు చాలా తక్కువగా కనిపిస్తున్నారు. కొందరైతే సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావాలని వ్యక్తిగత విమర్శలకూ దిగుతున్నారు. ఇది ఏమాత్రం ఉపేక్షించదగిన విషయం కాదు" అంటూ సమీక్షకుల తీరుపై కనిక మండిపడ్డారు. కాజోల్, కృతి సనన్ కీలక పాత్రల్లో నటించిన ఈ క్రైమ్ థ్రిల్లర్ చిత్రానికి కనిక కథను అందించడంతోపాటు నిర్మాతగానూ వ్యవహరించారు.



## క్రేజీ కాంబినేషన్.. ప్రభాస్‌తో లోకేష్ కనగరాజ్‌మూవీ.?

**పా**న్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం ఫుల్ బిజీగా గడుపుతున్న విషయం తెలిసిందే. గత ఏడాది సలార్ సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న ఈ నటుడు ఆ తర్వాత కల్కి అంటూ వచ్చి మరో బ్లాక్ బస్టర్‌ను ఖాతాలో వేసుకున్నాడు. ప్రస్తుతం ప్రభాస్ నటిస్తున్న సినిమాలు చూసుకుంటే.. సలార్ 2తో పాటు కల్కి 2, రాజా సాబ్, స్పిరిట్, ఫౌజీ చిత్రాలు లైనప్‌లో ఉన్నాయి. అయితే ఇవే కాకుండా తాజాగా హనుమాన్ దర్శకుడు ప్రశాంత్ వర్మతో కలిసి పీవీసీ యూలో కూడా చేయబోతున్నట్లు తెలుస్తుంది. ఇదిలావుంటే ప్రభాస్ మరో క్రేజీ దర్శకుడికి ఒకే చెప్పినట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఇంతకీ ఆ దర్శకుడు ఎవరో కాదు. ఖైదీ, విక్రమ్, మాస్టర్, లియో లాంటి బ్లాక్ బస్టర్‌లు అందుకున్న లోకేష్ కనగరాజ్. అవును.. ప్రభాస్ తన నెక్స్ట్ ప్రాజెక్ట్ లోకేష్ కనగరాజ్‌తో చేయబోతున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి.



# మా ప్రార్థనలకు సమాధానం దువా

**బా**లీవుడ్‌లోని వన్నాఫ్ ది క్రేజీ కపుల్స్ రణ్‌వీర్ సింగ్ దీపికా పదుకోన్ తమ కుమార్తెకు దువా పదుకోన్ సింగ్ అని నామకరణం చేశారు. ఆ పేరును ఖరారు చేసినట్లుగా వెల్లడించి, దువా కాళ్లు మాత్రమే కనిపించేలా రణ్‌వీర్%-%దీపికలు ఓ ఫొటోను షేర్ చేశారు. "మా కుమార్తెకు దువా పదుకోన్ సింగ్ అనే పేరు పెట్టాం. దువా అంటే ప్రార్థన. మా ప్రార్థనలకు దువా సమాధానం. అందుకే మా కుమార్తెకు ఆ పేరు పెట్టాం" అని పేర్కొన్నారు రణ్‌వీర్%-%దీపిక. 2018లో రణ్‌వీర్ సింగ్%-%దీపికా పదుకోన్ వివాహం చేసుకున్నారు. 2023 సెప్టెంబరులో దీపిక ఓ పాపకు జన్మనిచ్చారు.

# పక్కా ప్లానింగ్‌తో 'కంగువ'.. మరి ఆ సమస్య?

**రీ**సెంట్ టైంలో తెలుగులో పెద్ద సినిమాలు కొన్నింటికి వేకువజామున షోలు పడుతున్నాయి. 'గుంటూరు కారం', 'సలార్', 'దేవర' చిత్రాలు సూర్యుడు రాకముందే ప్రేక్షకుల్ని పలకరించేశాయి. ఇవంటే తెలుగు సినిమాలు కాబట్టి ప్లాన్ చేశారనుకోవచ్చు. ఇప్పుడు డబ్బింగ్ చిత్రం 'కంగువ' కూడా అదే ఫాలో అయిపోతోంది. తమిళ హీరో సూర్య చేసిన పాన్ ఇండియా మూవీ 'కంగువ'. నిర్మాత అయితే ఏకంగా రూ.2000 కోట్లు వచ్చేస్తాయనే ధీమాతో ఉన్నారు. బహుశా కంటెంట్‌పై నమ్మకంతో ఇలా అనుండొచ్చు. అయితే ఇప్పుడు అదే నమ్మకంతో ఆంధ్ర, తెలంగాణ, కేరళ, కర్ణాటకలో వేకువజామున 4 గంటల నుంచే షోలు పడనున్నాయి. ఈ విషయాన్ని స్వయంగా నిర్మాణ సంస్థ ట్వీట్ చేసింది.కాకపోతే తమిళనాడు ప్రభుత్వం నుంచి మాత్రం ఇంకా అనుమతి రావాల్సి ఉంది. గతంలో తమిళనాడులోనూ ఎర్లీ మార్నింగ్ షోలు వేసేవారు. కానీ అత్యుత్సాహంతో కొన్ని ప్రమాదాలు జరిగాయి. ఒకరిద్దరు అభిమానులు చనిపోయారు. అప్పటినుంచి తమిళనాడులో వేకువజామున షోలు వేయట్లేదు. ఈ లెక్క ప్రకారం చూసుకుంటే 'కంగువ' కూడా ఇవ్వకపోవచ్చు. ఒకవేళ ఇదే జరిగితే మాత్రం తమిళ ప్రేక్షకుల కంటే తెలుగు ఆడియెన్సే 'కంగువ'ని మొదట చూసేస్తారు! నవంబర్ 14న 'కంగువ' థియేటర్లలోకి రానుంది. అయితే కోర్టులో రిలయన్స్ సంస్థ కేసు పెట్టింది. ఈ చిత్ర నిర్మాణ సంస్థ స్టూడియో గ్రీన్ తమ దగ్గర తీసుకున్న అప్పు చెల్లించలేదని, అది తిరిగిచ్చేవరకు 'కంగువ' విడుదల నిలుపుదల చేయాలని పిటిషన్ వేసింది. ప్రస్తుతం ఇది విచారణ సాగుతోంది. ఈ సమస్య పరిష్కారమైతే ఓకే. లేదంటే మాత్రం వాయిదా తప్పదేమో?

# ఆ దర్శకుడు నన్ను పక్కన పెట్టేశారు: మీనాక్షి శేషాద్రి



**1990**వ దశకంలో దేశంలో అగ్ర కథానాయికల్లో ఒకరిగా వెలిగింది మీనాక్షి శేషాద్రి. ఒకదశలో అత్యధిక పారితోషికం అందుకున్న హీరోయిన్‌గానూ నిలిచింది. తాజాగా ఓ ఆన్‌లైన్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన సినిమా జీవితాన్ని మలుపు తిప్పిన ఓ సంఘటన గురించి అభిమానులతో పంచుకున్నది. 1985లో వచ్చిన 'మేరీ జంగ్' సినిమా.. మీనాక్షి సినీ కెరీర్‌కు టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. ఈ చిత్రంలో మీనాక్షి వేసింది చిన్నపాత్రే అయినా.. నటిగా మంచి గుర్తింపు తీసుకొచ్చింది. తనలో బహుముఖ ప్రతిభను వెలికితీసింది. అయితే, ఈ చిత్ర దర్శకుడు సుభాష్ ఘాయ్‌తో తనకు మంచి అనుబంధం ఉండేదనీ, ఒక చిన్న అపార్థం.. తమ మధ్య వృత్తిపరమైన సంబంధాన్ని తీవ్రంగా దెబ్బతీసిందనీ చెప్పుకొచ్చింది. "మేరీ జంగ్ చిత్రంలో నేను పోషించింది చిన్నపాత్రే అయినా నాకు మంచి పేరు తీసుకొచ్చింది. అంత ప్రాధాన్యత లేకపోయినా.. దర్శకుడు సుభాష్ నన్ను బాగా హైలైట్ చేశారు. సినిమాల్లో చిన్నపాత్రలే కీరోల్ ప్లే చేస్తాయనీ, ప్రేక్షకులకు దగ్గర చేస్తాయనీ ఆయన ఎప్పుడూ చెబుతుండేవారు. నా విషయంలోనూ అదే జరిగింది!" అంటూ నాటి విషయాలను పంచుకున్నది మీనాక్షి. నిజానికి దర్శకుడు సుభాష్ ఘాయ్.. తన చిత్రాల్లో మీనాక్షికి పెద్దపెద్ద పాత్రలు ఇవ్వాలని అనుకునేవాడట. కానీ, తను ఆయన అంచనాలను అందుకోలేకపోయిందట.అదే విషయం చెబుతూ.. "అప్పటికి నేను చాలా చిన్నదాన్ని. ఇండస్ట్రీలో ఎవరితో ఎలా ప్రవర్తించాలో తెలియదు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.